# ప్రజాశక్తి

మంగళవారం 11 ఏప్రిల్ 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

# కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధం

◆ విమ్స్‌లో వంద పడకలు ఏర్పాటు

◆ సాధారణ రోగులకు ఇబ్బందులు లేకుండా జ్వరాలకు ప్రత్యేక బ్లాక్ ◆ కోవిడ్ ఏర్పాట్లపై మాక్ డ్రిల్

**ప్రజాశక్తి - అరిలోవ :** కోవిడ్ ఎక్స్‌బిబి 1.16 దేశంలో ప్రభావం చూపే అవకాశాలు ఉన్నట్లు నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ క్రమంలోనే కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు జిల్లాల్లోని ఆస్పత్రులను అధికారులు సిద్ధం చేస్తున్నారు. అందులో భాగంగా మొదటి, రెండో వేవ్‌లలో డెడికేటెడ్ కోవిడ్ ఆసుపత్రిగా నిలిచిన విమ్స్‌ను 100 పడకలతో ఇప్పటికే సిద్ధం చేశారు. అందుకు సంబంధించిన మాక్ డ్రిల్‌ను విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్‌ను విజయవంతంగా ఎదుర్కొనేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగా కోవిడ్ రోగులకు అందించాల్సిన మందులు, ఆక్సిజన్ సరఫరాకు ఎటువంటి ఆటంకమూ కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం వంద పడకలను కేటాయించామని, అవసరం బట్టి వాటి సంఖ్యను 600 పడకలకు పెంచుతామని తెలిపారు. ప్రతి పడకకూ ఆక్సిజన్ సదుపాయం ఏర్పాటు చేశామన్నారు.

కోవిడ్ నేపథ్యంలో ఏర్పాటు చేసిన పడకలను పరిశీలిస్తున్న విమ్స్ డైరెక్టర్ రాంబాబు

200 ఐసియు పడకలను అందుబాటులోకి తీసుకునిరాగల సామర్థ్యం విమ్స్ ఆస్పత్రికి ఉందన్నారు. విమ్స్‌లో అందుబాటులో ఉన్న రెండు ఆక్సిజన్ ట్యాంకులు, రెండు ఆక్సిజన్ ప్లాంట్లును పరిశీలించామన్నారు. విమ్స్ ప్రస్తుతం సాధారణ రోగులకు ఉత్తమ వైద్యం అందించడంలో నిమగ్నమై ఉన్నందున.. వారికి ఎటువంటి ఇబ్బందీ లేకుండా ఉండేందుకు కోవిడ్ లక్షణాలు ఉన్నవారికి ప్రత్యేకంగా ఫీవర్ ఒపిని ఏర్పాటు చేశామన్నారు. అక్కడే రోగులకు పరీక్షించి కరోనా పాజిటివ్ అయితే కోవిడ్ వార్డుకు, సాధారణ జ్వరం అయితే సాధారణ వార్డుకు తరలిస్తామన్నారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న విశాఖ పోర్టు నూతన ఛైర్మన్ రామచంద్రన్

విశాఖ పోర్టు ఛైర్మన్‌గా

# రామచంద్రన్ బాధ్యతల స్వీకరణ

**ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో :** ఏప్రిల్ 1 నుంచి విశాఖపట్నం పోర్టు అథారిటీ ఛైర్మన్‌గా అదనపు బాధ్యతలను టికె.రామచంద్రన్‌కు అప్పగిస్తూ కేంద్ర పోర్టులు, నౌకా, జలరవాణా మంత్రిత్వ శాఖ తాజాగా ఉత్తర్వులను జారీ చేసింది. ఈ ఉత్తర్వులు వెంటనే అమల్లోకి వచ్చేశాయి. ప్రస్తుతం రామచంద్రన్ ట్యుటికోరిన్‌లోని విఒ చిదంబరం పోర్టు ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు. ఉత్తర్వులు అందిన క్రమంలో విశాఖపట్నం పోర్టు ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టేందుకు రామచంద్రన్ సోమవారం విశాఖకు వచ్చారు. పోర్టు అధికారులతో కలిసి పోర్టు కార్యకలాపాలను పరిశీలించారు. పోర్టు పరిపాలనా భవనంలోని బోర్డు రూంలో ఉన్నతాధికారులతో సమావేశమై పలు అంశాలపై కూలంకుషంగా చర్చించారు. సమావేశంలో పోర్టు డిప్యూటీ ఛైర్మన్‌తో పాటు విభాగాధిపతులు పాల్గొన్నారు.

రామచంద్రన్ తమిళనాడు రాజధాని చెన్నయ్‌లో జన్మించారు. విద్యాభ్యాసం చెన్నయ్, నాగపూర్, ఢిల్లీలలో సాగింది. ఆయన 1991 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన వారు. బ్యాచ్‌లర్స్ డిగ్రీని ఐఐటి ఖరగ్‌పూర్‌లో, కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్ ఆఫ్ టెక్నాలజీ (పిజి)ని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఢిల్లీలో మిగతా 2లో..

## సమస్యలపై మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

▶ వార్త 2లో..

## జగనన్న ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

▶ వార్త 2లో..

## 14 నుంచి సముద్రంలో చేపల వేట నిషేధం

▶ వార్త 4లో..

ఉక్కు దీక్షలకు సంఘీభావం తెలుపుతూ మాట్లాడుతున్న తోట చంద్రశేఖర్

## ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

బిఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు తోట చంద్రశేఖర్ వార్త మెయిన్‌లో..

జి 20 అభివృద్ధి పనుల్లో..

# అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టాలి

మేయర్‌కు సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు వినతి

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** జి 20 సన్నాహక సదస్సు సందర్భంగా జివిఎంసి చేపట్టిన వివిధ రకాల అభివృద్ధి పనుల్లో జరిగిన భారీ అవినీతి, అక్రమాలపై జివిఎంసి ఫ్లోర్ లీడర్లు లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరుతూ జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్, సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు నగర మేయర్ హరి వెంకట కుమారికి సోమవారం ఉదయం 'స్పందన'లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖలో గత నెల 28 నుంచి 30 వరకు జరిగిన జి 20 దేశాల సన్నాహక సదస్సు సందర్భంగా జివిఎంసి సుమారు రూ.160 కోట్ల విలువగల అనేక రకాల అభివృద్ధి పనులు చేపట్టిందని, వాస్తవంగా ఈ సదస్సు నిర్వహణ బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదని పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రజలు కట్టే పన్నుల ద్వారా

మేయర్‌కు వినతిపత్రం అందజేస్తున్న డాక్టర్ బి.గంగారావు

వచ్చిన సొమ్ములో సుమారు రు115.71 కోట్లు, విఎంఆర్‌డిఎ, ఎపి గ్రీన్ బిల్డింగ్ కార్పొరేషన్, ఆర్ అండ్ బి, జాతీయ రహదారుల సంస్థల ద్వారా సమకూరిన మిగతా 2లో..

## మొదటి పేజీ తరువాయి..

### అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టాలి

మరో రూ.45 కోట్లు ఖర్చు చేసినట్లు ఈ నెల 7న జరిగిన సమయంలో మేయర్ తెలియజేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ సందర్భంగా వివిధ పనులకు చేసిన ఖర్చులను తెలియపరిచారన్నారు. ఈ పనులను సిపిఎం స్వయంగా పరిశీలించిందని, భారీగా అవినీతి, అక్రమాలు జరిగాయని తాము గుర్తించామని తెలిపారు. పనులన్నీ నాసిరకంగానూ, ప్రజా నిరుపయోగంగానూ వున్నాయని పేర్కొన్నారు. వాస్తవ విలువ కన్నా 300 నుంచి 500 శాతం అధికంగా చూపి పెద్దయెత్తున ప్రజాధనాన్ని లూటీ చేసినట్లు స్పష్టమవుతోందన్నారు. జివిఎంసి కౌన్సిల్ ఆమోదానికి పెట్టకుండా పనులను చట్ట విరుద్ధంగా చిన్నవిగా విడగొట్టడం, టెండర్స్ పిలవకుండా పనులు చేయించడం, ముందస్తు అనుమతుల పేర పనులు చేపట్టడం వంటి చట్ట విరుద్ధ, అక్రమ చర్యలకు పాల్పడినట్లు తెలిపారు. వీటిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. బిటి రహదారులకు రూ.27.55 కోట్లు, పుట్‌ఫాత్ పునరుద్ధరణ, మరమ్మతుల కోసం ఏకంగా రూ.23.40 కోట్లు ఖర్చు చేసినట్టు చూపారని, వేసిన బిటి రహదారులన్నీ తీవ్ర నాణ్యతా లోపంగా ఉన్నాయని తెలిపారు. ఇక పుట్‌పాత్ మరమ్మతుల్లో సగానికి సగంపైగా అక్రమాలు, అవినీతి జరిగాయన్నారు. కైలాసగిరి కింద సీతకొండ వ్యూ పాయింట్‌కు రూ.3.29 కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారని, వాస్తవంగా రూ.కోటి కూడా ఖర్చు కాదని అన్నారు. గుడ్లవానిపాలెం, జోడుగుల్లపాలెం, సాగర్ నగర్ బీచ్‌ల వద్దా ఇలానే జరిగిందన్నారు. ఎక్కడెక్కడ ఎంత దుర్వినియోగం జరిగిందో గంగారావు వివరించారు. జి 20 పేర చేసిన వ్యయం పూర్తిగా ప్రజలకు, నగరానికి ఏమాత్రమూ ఉపయోగపడకపోగా పూర్తిగా విశాఖ ప్రజలు వివిధ రకాల పన్నుల పేర చెల్లించిన సొమ్ము కొల్లగొట్టబడిందన్నారు. నాసిరకం పనులపైన, రంగులపైన వచ్చిన విమర్శల నేపథ్యంలో ఆంధ్రా యూనివర్సిటీలోని ఇద్దరి ఆచార్యులతో విచారణ కమిటీని వేసినట్లు తెలిపారు. ఆ కమిటీలో జివిఎంసిలోని మరో ఇద్దరు వున్నట్లు చెప్పారు. కేవలం జరిగిన పనులన్నీ నాణ్యంగా జరిగాయని సర్టిఫికెట్ ఇప్పించుకోవడానికి ముందస్తు ప్రణాళికతో వేసిన కమిటీలా ఇది ఉందని పేర్కొన్నారు. ఎపి గ్రీన్ బిల్డింగ్ కార్పొరేషన్, విఎంఆర్‌డిఎ, జాతీయ రహదారుల సంస్థ, అర్ అండ్ బి సంస్థల నుంచి నిధులు మంజూరైనట్టు తెలిపారని, కానీ ఇప్పటివరకు ఎంత వచ్చింది, ఇంకా ఎంత రావాలో చెప్పలేదని అన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేస్తున్నట్లు జిఒ కూడా లేదన్నారు. కనుక ఈ సంస్థల నిధుల భారం కూడా జివిఎంసి మీదే పడుతుందని ఆయన తన వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎం.సుబ్బారావు పాల్గొన్నారు.

### రామచంద్రన్ బాధ్యతల స్వీకరణ

అభ్యసించారు. పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ డిగ్రీని అమెరికాలోని ప్రిన్సెటన్ యూనివర్సిటీలో పూర్తి చేశారు. అందులో ఆయన వరల్డ్ బ్యాంక్ రాబర్ట్ మెక్ నామారా ఫెలోషిప్‌ను అందుకున్నారు. ఐఎఎస్ తమిళనాడు క్యాడర్ అధికారిగా రాష్ట్ర ప్రభుత్వంలో పలు కీలక బాధ్యతలను నిర్వర్తించారు. తమిళనాడులో హైవేస్ అండ్ మైనర్ పోర్టుల విభాగం, పర్యాటకం, దేవాదాయ శాఖలకు కార్యదర్శి హోదాలో ఉన్నారు. రామనాథపురం, విల్లుపురం జిల్లాలకు కలెక్టర్‌గా వ్యవహరించారు. చెన్నయ్ కార్పొరేషన్‌లో డిప్యూటీ కమిషనర్‌గా ఉన్నారు. తమిళనాడు న్యూస్ ప్రింట్ అండ్ పేపర్స్ లిమిటెడ్ ఎండిగా వ్యవహరించారు. తమిళనాడు ప్రభుత్వంలో ఇన్ఫర్‌మేషన్ టెక్నాలజీ విభాగం కార్యదర్శిగా ఉన్నారు. ఆర్థిక రంగం అభివృద్ధి, స్థిరమైన అభివృద్ధి, పర్యావరణం, మౌలిక వసతులు పట్టణాభివృద్ధి, వ్యవస్థల నిర్వహణ, ఈ గవర్నెన్స్, ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య విధానాలు వంటి అంశాల్లో ఆయన ప్రావీణ్యులు. ఆయా విభాగాలలో ఆయన పలు పుస్తకాలు రాశారు.

### అన్ని పోటీ పరీక్షలకూ సమ్మర్ కామన్ కోచింగ్

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** అన్ని ప్రభుత్వ ఉద్యోగాలకు, విద్యాలయాల ప్రవేశాలకు ఉపయోగపడేలా సమ్మర్ కామన్ కోచింగ్ ప్రారంభించబోతున్నట్లు అల్లూరి స్టడీ సర్కిల్ నిర్వాహకులు కె.అభిమన్యు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండు నెలల పాటు నిర్వహించే ఈ తరగతులు వేసవి సెలవులలో యువత సమయాన్ని వృథా కాకుండా సద్వినియోగ పరుస్తాయన్నారు. శిక్షణ వారి అభివృద్ధికి దోహదం చేసేలా ఉంటుందన్నారు. విద్యాలయాల ప్రవేశ పరీక్షలలోనూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు కామన్‌గా ఉండే ఇంగ్లీష్ లాంగ్వేజ్, అర్థమెటిక్, రీజనింగ్, జికె, కరెంట్ అఫైర్స్ సబ్జెక్టులను బోధిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరింత సమాచారం కోసం డాబాగార్డెన్స్‌లోని అల్లూరి స్టడీ సర్కిల్ కార్యాలయాన్ని లేదా 8008412798 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

### 'మా భూములను జలవిహార్ రామరాజుకు కట్టబెట్టొద్దు'

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** జగనన్న కాలనీల ఇళ్ల స్థలాల కోసం తమ వద్ద నుంచి తీసుకుంటున్న డి- పట్టా భూములకు ప్రభుత్వం తమకు ఇవ్వవలసిన ఎల్‌పిఒసి సర్టిఫికెట్లను ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తూ, వాటిని ఈ ప్రాంతంలోని బ్రోకర్‌గా వ్యవహరిస్తున్న జలవిహార్ రామరాజుకు తాము ఇవ్వడానికి అంగీకరించాలని అన్ని రకాలుగా ఒత్తిడి తెస్తున్నారని ముదపాక రైతుల నాయకుడు ముదపాక రాము అన్నారు. సోమవారం మదపాక రైతులతో కలెక్టరేట్ ఎదుట ఆయన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు.

# జగనన్న ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

**విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున**

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. సోమవారం సాయంత్రం జగనన్న గృహ నిర్మాణ పథకం, మౌలిక సదుపాయాల కల్పనపై విఎంఆర్‌డిఎ కార్యాలయంలో విఎంఆర్‌డిఎ, హౌసింగ్, జివిఎంసి, రెవెన్యూ తదితర జిల్లా శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ళ గ్రౌండింగ్ పనులు వేగవంతం చేయాలని అన్నారు. ప్రభుత్వ పథకాలలో జగనన్న గృహ నిర్మాణ పథకం చాలా ముఖ్యమైన కార్యక్రమమని తెలిపారు. విశాఖ జిల్లాలో గృహ నిర్మాణ పథకంలో ప్రభుత్వం ద్వారా నిర్మించుకున్న ఇళ్ళ నిర్మాణాలు అధికంగా ఉన్నందున అధికారులందరూ చిత్తశుద్ధితో పనిచేయాలని, వీలైనంత తక్కువ సమయంలో లబ్ధిదారులకు ఇళ్లను నిర్మించి అందజేయాలని అన్నారు. ఇండ్ల నిర్మాణానికి భూమి అనుకూలంగా లేనట్లయితే తక్షణమే అటువంటి భూములను పరిశీలించి అదే లే అవుట్‌లో రిజర్వు చేసిన స్థలాల్లో కేటాయించాలని, లేనిపక్షంలో దగ్గరలో ఉన్న లే అవుట్‌లో కేటాయించాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. ఒకవేళ ఎక్కడా భూమి లేనట్లయితే ల్యాండ్ పూలింగ్ చేయాలని ఆదేశించారు. ప్రత్యేక కార్యాచరణ ద్వారా జిల్లాలో ఉన్న మొత్తం 81 జగనన్న హౌసింగ్ లే అవుట్లలో భూములను విఎంఆర్‌డిఎ, జివిఎంసి, రెవెన్యూ, హౌసింగ్ అధికారులు పరిశీలించి తక్షణమే రిపోర్టు అందించాలని అన్నారు. అదేవిధంగా భవిష్యత్తులో ఏ ఒక్క లబ్ధిదారుడూ ఇబ్బందికి గురికాకుండా పూర్తి వివరాలతో పట్టాలు అందించాలని జివిఎంసి అధికారులను ఆదేశించారు. ఎండాకాలం సందర్భంగా అన్ని లే అవుట్లలో నీటి సదుపాయ ఏర్పాట్లను పరిశీలించాలని అన్నారు. రానున్న మూడు నెలల కాలం ఇళ్ల నిర్మాణానికి చాలా అనుకూలమైన సమయమని, వర్షాకాలం ప్రారంభం కాకముందే వీలైనంత వరకూ మేజర్ పనులు పూర్తిచేయాలని అన్నారు. భారీ వర్షాలకు లే అవుట్లలో ఇళ్ల నిర్మాణానికి ఇబ్బందులు లేకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఇంటి నిర్మాణ సామగ్రి తగినంత స్టాక్ చేయాలని అన్నారు. కార్యక్రమంలో విశాఖ ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్, భీమిలి ఆర్‌డిఒ భాస్కర్ రెడ్డి, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, విఎంఆర్‌డిఎ అధికారులు పాల్గొన్నారు.

# డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలి

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** డిఎస్‌సి నోటిఫికేషన్ తక్షణమే విడుదల చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు యుఎస్ఎన్.రాజు డిమాండ్ చేశారు. సోమవారం స్పందనలో ఆయన ఆధ్వర్యంలో సంఘం నేతలు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నాలుగు సంవత్సరాల నుంచి డిఎస్‌సి ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేస్తోందన్నారు. రాష్ట్రంలో టిటిసి, బిఇడి చేసిన అభ్యర్థులు లక్షల మంది డిఎస్‌సి నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. యువతకు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు మరిచి నిరుద్యోగులను నట్టేట్లో ముంచి వారి ఆత్మహత్యలకు కారణమవుతోందని తెలిపారు. రాష్ట్రంలో 50 వేల పోస్టులకుపైగా ఉపాధ్యాయ ఖాళీలు ఉంటే మన విద్యాశాఖ మంత్రి మాత్రం నోటికి వచ్చిన లెక్కలు చెబుతున్నారని, కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యువతకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి సంతోష్, జిల్లా సహాయ కార్యదర్శి బి.తులసి పాల్గొన్నారు.

ప్లకార్డులు ప్రదర్శిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

### 739వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయవద్దని, ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు సోమవారం నాటికి 739వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియుఐ మత్స్యకార మహిళలు కూర్చున్నారు.

### విశాఖ ఉక్కుపై తెలంగాణ ప్రభుత్వ చొరవ అభినందనీయం

**ఎంవిపి.కాలనీ :** స్టీల్‌ప్లాంట్ విషయంలో తెలంగాణ ప్రభుత్వ చొరవకు ఉత్తరాంధ్ర అధ్యయన వేదిక వ్యవస్థాపకులు, యుపిఎస్‌సి మాజీ ఛైర్మన్ ప్రొఫెసర్ కెయస్.చలం కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పబ్లిక్ సెక్టార్‌పై బిఆర్ఎస్ విధానాన్ని మెచ్చుకున్నారు.

# సమస్యలపై మధ్యాహ్న భోజన పథకం కార్మికుల ధర్నా

ధర్నా నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు వేతనాలు పెంచాలని, ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలని, అక్షయపాత్రను రద్దు చేయాలని, మెనూ ఛార్జీలు పెంచాలని ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా నాయకులు డి.రాము, ఎల్.ఈశ్వరమ్మ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు పి.మణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు రాగిజావ వండి, సరఫరా చేయాలని ఇచ్చిన ఆదేశాలను అక్షయపాత్ర సంస్థవారు అమలు చేయటం లేదన్నారు. అక్షయపాత్ర వున్న జివిఎంసి ప్రాంతాలు, ఆనందపురం, భీమిలి మండలాల్లో మధ్యాహ్న భోజన పథకం కార్మికులే రాగిజావ వండుతున్నారని తెలిపారు. అక్షయపాత్ర సంస్థ వారు కేవలం భోజన సరఫరా మాత్రమే చేస్తున్నారన్నారు. కాబట్టి తక్షణం గ్యాస్, పాత్రలు, అదనపు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కోడి గుడ్లు ఉడకబెతున్నందుకు అక్షయ పాత్రవారు ఒక గుడ్డుకు 10 పైసలను చెల్లిస్తున్నారని, ఆ డబ్బులు కూడా ప్రతి నెలా ఇవ్వడం లేదని తెలిపారు. ఎప్పుడో ఉదయం 3 గంటలకు భోజనం వండి విద్యార్థులకు సరఫరా చేయడం వల్ల ఆహారం చల్లగా అయిపోయి విద్యార్థులు తినడానికి ఇష్టపడటం లేదన్నారు.

ఇప్పటికైనా ప్రభుత్వం పరిశీలన చేసి అక్షయపాత్రను రద్దు చేయాలని, నేరుగా కార్మికులే విద్యార్థులకు వేడివేడిగా వండి భోజనం పెట్టేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈలోగా ఒక కోడిగుడ్డుకు 30 పైసలు చెల్లించాలన్నారు. పని భారం తగ్గించాలన్నారు. పాఠశాలల్లో స్థానికంగా వస్తున్న సమస్యలను పరిష్కరించడానికి ప్రత్యేక అధికారిని నియమించాలని కోరారు. ధర్నాలో యూనియన్ జిల్లా నాయకులు సుధా, కన్నతల్లి, పందిరి గౌరి, అప్పలనర్సమ్మ, వరలక్ష్మి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

# మధురవాడలో విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి -మధురవాడ, పిఎం.పాలెం : మధురవాడలోని జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం ఆవరణలో విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. పరిష్కార వేదికలో వినియోగదారులు నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. పలువురు వినియోగదారులు తమ సమస్యపై వినతులను అందించారు. ఈ సందర్భంగా ఎపిఇపిడిసిఎల్ విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కార న్యాయస్థానం ఛైర్మన్, రిటైర్డ్ జిల్లా జడ్జి డాక్టర్ బి.సత్యనారాయణ మాట్లాడుతూ, న్యాయస్థానం ముందుకు తీసుకొచ్చిన సమస్యలను 60 రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు. ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలు పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు ఎదురయ్యే సమస్యలను తమ దృష్టికి నేరుగా, ఉత్తరం ద్వారా తీసుకురావచ్చని తెలిపారు. విద్యుత్ అధికారులు నిబంధనలు ఉల్లంఘిస్తే వినియోగదారులకు పరిహారం చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. 4గంటలు లోపు విద్యుత్ అంతరాయం పరిష్కారం చేయకపోయినా దీని పరిధిలోనికి వస్తుందని తెలిపారు.

పిఎం.పాలెం: విద్యుత్ వినియోదారుల సమస్యల సత్వర పరిష్కారానికి న్యాయస్థానం ఏర్పాటు ఎంతో వెసులుబాట కల్పిస్తుందని విశ్రాంత జిల్లా న్యాయమూర్తి డాక్టర్ బి.సత్యనారాయణ పేర్కొన్నారు. పిఎంపాలెంలోని సాంకేతిక కళాశాలలో విద్యార్థులకు విద్యుత్ సమస్యలపై అవగాహన కల్పించారు. విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలపై ముందుగా తమ ప్రాంత పరిధిలోని విద్యుత్ కార్యాలయంలోని అసిస్టెంట్ ఇంజినీరు స్థాయి సిబ్బందిని సంప్రదించాలని, 1912 టోల్ ఫ్రీ నంబరుకు కాల్ చేసి ఫిర్యాదును నమోదు చేసుకోవాలని తెలిపారు. ఫిర్యాదు చేసినప్పటికీ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే న్యాయస్థానాన్ని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్.హరిబాబు, జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆపరేషన్ పోలాకి శ్రీనివాసరావు, మధురవాడ ఎడిఇ కిరణ్ కుమార్, ఎఇఇ రామమూర్తి, పిఎం.పాలెం ఎఇ ఎం.అప్పలనాయుడు, జోన్-3 ఎడిఇలు, ఎఇలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి వినతులు స్వీకరిస్తున్న అధికారులు

# కాలుష్యం నుంచి రక్షించండి : మేయర్

ప్రజాశక్తి - ఆరిలోవ : నగరాన్ని కాలుష్యం నుంచి రక్షించేందుకు అందరి సహకారం అవసరమని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా సోమవారం ఆమె ఆరిలోవలోని తమ క్యాంప్ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్సులో జివిఎంసి ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. డయల్ యువర్ మేయర్, స్పందనతో పాటు ఇతర కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం తిరిగి బస్సులోనే తమ క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతుందని, కాలుష్య నియంత్రణకు వారంలో ఒక్కరోజు అందరూ ప్రజా రవాణాను ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు. కాలుష్య నియంత్రణకు తనతోపాటు జీవీఎంసీ ఉద్యోగులు ఒక్కరోజు తమ వాహనాలను వదిలి ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగిస్తున్నారని తెలిపారు.

# ఆనందపురం పాస్టర్స్ ఫెలోషిప్ నూతన ఎన్నిక

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం పూల మార్కెట్ వద్ద గల డేవిడ్‌రాజు చర్చిలో పాస్టర్ల ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. సంఘ ముఖ్య సలహాదారులు జీవన్.ప్రశాంత్‌కుమార్, డాక్టర్ జంగం జోషి, ఎన్‌విపిడి.ప్రభాకర్ నేతృత్వంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా ఎం.అబ్రహం, అధ్యక్షులుగా ఆర్.ప్రభుదాస్, ఉపాధ్యక్షులుగా పి.శాంతిరాజు, కార్యదర్శిగా వి.ఆనందరావు, సహ కార్యదర్శిగా బొత్స డేవిడ్, కోశాధికారిగా పి.హనోక్, ప్రవీణ్ కుమార్, కార్యవర్గ సభ్యులుగా గ్లోరీ పుష్ప, మినీ గ్లోరీ, ఎస్.పాల్, పీటర్ ఎన్నికయ్యారు. నిర్వాహకులు మాట్లాడుతూ, వీరి పదవీకాలం రెండేళ్లు ఉంటుందని తెలిపారు. సంఘం విధి విధానాలను నూతన కార్యవర్గానికి వివరించారు. అనంతరం శుభాకాంక్షలు తెలియజేసి ప్రార్థనతో ముగించుకున్నారు. ఈ కార్యక్రమములో ఎం.ఐజక్, బి.ప్రసాద్, బొగత డేవిడ్, శ్యాంబాబు గిద్యోన్ తదితరులు పాల్గొన్నారు.

# 14 నుంచి సిపిఎం, సిపిఐ ప్రచారం

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం, సిపిఐ నాయకులు

ప్రజాశక్తి -తగరపువలస : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన ఈ నెల 14 నుంచి 30వ తేదీ వరకు ప్రచారం, ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సిపిఎం భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి, సిపిఐ నాయకులు కానూరి రాంబాబు తెలిపారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఇరు పార్టీల నాయకులు సోమవారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఇరు పార్టీల నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్.అప్పలనాయుడు, అల్లు బాబూరావు, ఎం.వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఇన్‌ఛార్జి అడ్మిన్‌పై మహిళా వాలంటీర్ ఫిర్యాదు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి రెండో వార్డు పరిధి ఆదర్శనగర్-1 సచివాలయం ఇన్‌ఛార్జి అడ్మిన్ సంతోష్ తనపట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు వాలంటీర్ పి.నూకలక్ష్మి సోమవారం జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాముకు సోమవారం స్పందనలో ఫిర్యాదు చేశారు. రాత్రి వేళ 11గంటల సమయంలో కూడా వాట్సాప్ మెసేజ్ పెడుతూ వివిధ రూపాల్లో వేధిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ప్రశ్నిస్తే వేతనాలు ఆపేస్తానని, వాలంటీర్ ఉద్యోగం నుంచి తొలగించేస్తానని బెదిరిస్తున్నారని తెలిపారు. తనలాగే సహచర మహిళా వాలంటీర్లను కూడా వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఇన్‌ఛార్జి అడ్మిన్ సంతోష్ వ్యవహార శైలి నచ్చక ఆరుగురు మహిళా వాలంటీర్లు విధుల నుంచి పూర్తిగా తప్పుకున్నారని తెలిపారు. ఫిర్యాదు చేసిన వాలంటీర్ నూకలక్ష్మికి సంఘీభావంగా సహచర మహిళా వాలంటీర్లు జెజె జయశ్రీ, ఎం.లావణ్య, వి.ఆమని, టి.రాధ, సిఐటియు నాయకులు ఆర్ఎస్ఎన్.మూర్తి, రవ్వ నరసింగరావు వెళ్లారు.

## వెబ్‌సైట్‌లో డిఎస్‌సి 1998 అభ్యర్థుల జాబితా

ప్రజాశక్తి - ఆరిలోవ : డిఎస్‌సి 1998 అభ్యర్థులు కనీస టైంస్కేల్ ప్రాతిపదికన పనిచేసేందుకు అర్హులైన 355 మంది జాబితాను డిఇఒ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 11వ తేదీన 10 గంటలకు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో రావాలని పేర్కొన్నారు. ఈ నెల 12, 13 తేదీల్లో అపాయింట్‌మెంట్ ఉత్తర్వులు ఇవ్వనున్నట్లు తెలిపారు.

## పూర్వ విద్యార్థుల వితరణ

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు సహచర పూర్వ విద్యార్థిని భర్త ఆరోగ్యం బాగా లేదని తెలుసుకొని ఆ కుటుంబానికి సోమవారం రూ.20వేలు సాయం చేశారు. సాయం చేసిన వారిలో పూర్వ విద్యార్థులు శ్రీనివాసవర్మ, సూరి బాబు, హేమచందర్ తదితరులు ఉన్నారు.

## జోన్ 2లో వినతుల వెల్లువ

ప్రజాశక్తి -పిఎం.పాలెం : మధురవాడ జోన్ -2 జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 11 వినతులు అందాయని జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి తెలిపారు. పిఎం.పాలెంలో ఉన్న ఆర్‌హెచ్.కాలనీ, షిప్‌యార్డు కాలనీ, హెచ్‌పి.నగర్ తదితర కాలనీలకు శ్మశానవాటికలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ జనసేన నాయకులు వినతి పత్రాన్ని సమర్పించారు. విద్యుత్ విభాగానికి సంబంధించి-3, ఈఈ వర్క్స్ -3, పట్టణ ప్రణాళిక విభాగం -3, వెల్ఫేర్, నీటి విభాగాలకు సంబంధించి చేరొకటి వినతులు వచ్చాయి. వాటిని నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించాలని సంబంధిత అధికారులకు జోనల్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

## స్పందనకు 9 అర్జీలు

ప్రజాశక్తి- భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనకు 9అర్జీలు అందినట్లు జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము తెలిపారు. పట్టణ ప్రణాళికా విభాగం యుసిడి విభాగానికి సంబంధించి చెరో రెండు చొప్పున, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి 4, రెవెన్యూ విభాగానికి సంబంధించి ఒక అర్జీ వచ్చినట్లు వివరించారు. సంబంధిత అర్జీలను తదుపరి చర్యల నిమిత్తం ఆయా విభాగాల అధికారులకు పంపినట్లు వివరించారు.

# నేరాలు ఘోరాలు

## 'గంభీరం'లో బీటెక్ విద్యార్థి గల్లంతు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం గంభీరం రిజర్వాయర్‌లో సోమవారం మధ్యాహ్నం గీతం యూనివర్సిటీ బీటెక్ విద్యార్థి గల్లంతయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం.. గీతం యూనివర్సిటీ కప్యూటర్స్ సైన్స్ నాలుగో సంవత్సరం అబ్బాయిలు10 మంది, అమ్మాయిలు ఐదుగురు సోమవారం 3:00 గంటలకు గంభీరం రిజర్వాయర్‌కు వచ్చారు. రిజర్వాయర్ పక్కన ఆడుకుంటుండగా బంతి రిజర్వాయరులో పడింది. బంతిని తీయడానికి నెల్లూరి తరుణ్‌కుమార్ రిజర్వాయర్‌లో దిగాడు. ఈత రాకపోవడంతో మునిగిపోయాడు. స్నేహితులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, గంభీరం గ్రామస్తులు గాలింపు చేపట్టినా తరుణ ఆచూకీ కానరాలేదు. గోపాలపట్నం రాములువీధికి చెందిన తరుణ్ కుమార్ తండ్రి శివప్రసాదరావు ఫిర్యాదు మేరకు ఆనందపురం సిఐ రామచంద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఆరిలోవ పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం రాత్రి హనుమంతువాక కూడలిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా వాహనదారులను తనిఖీ చేస్తుండగా నగరం నుంచి పెదగదిలివైపు వస్తున్న ఆటోను ఆపారు. ఆటోడ్రైవర్ మద్యం తాగి ఉండటంతోపాటు ఆటోలో సుమారు టన్ను రేషన్ బియ్యం ఉండడం గమనించారు. అనుమానం వచ్చి రేషన్ బియ్యంతో ఉన్న ఆటోను ఆరిలోవ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రేషన్ బియ్యం గొడౌన్ నుంచి వచ్చిన గోనె సంచులతో ఉండడం విశేషం.

## లారీ, బైక్ ఢీ : వ్యక్తి మృతి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: సుబ్బారాయుడుపాలెం వద్ద సోమవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఎదురెదురుగా వస్తున్న లారీ, బైకు ఢీకొన్న ప్రమాదంలో బైక్‌పై వెళ తున్న ఓ వ్యక్తి మృతి చెందగా ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతి చెందిన వ్యక్తి చింతపల్లికి చెందిన కంచే గణపతి ( 22) గా పోలీసులు గుర్తించారు. క్షతగాత్రులను నర్సీపట్నం ఏరియా హాస్పిటల్‌కి తరలించారు.

## కుక్క దాడిలో బాలునికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -తగరపువలస : కుక్క దాడిలో ఓ బాలునికి తీవ్ర గాయాలైన సంఘటన జివిఎంసి రెండో వార్డు పరిధి అల్లూరి సీతారామరాజు కాలనీలో చోటు చేసుకుంది. బాధితుని తండ్రి భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ ఇంటి ముంగిట ఆడుకుంటున్న ఆరేళ్ల కుమారుడు కొయ్యాన తన్వీర్‌పై ఇంటి పక్కనే ఉంటున్న యజమాని పెంపుడు కుక్క దాడి చేసి గాయపరిచినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పెంపుడు కుక్క యజమానికి గతంలో చెప్పినా సరే పట్టించుకోలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## బాలిక పట్ల అసభ్య ప్రవర్తనపై కేసు

ప్రజాశక్తి - ఆరిలోవ : చిన్నారిపై అసభ్యంగా ప్రవర్తించిన ఓ వ్యక్తిపై ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆరిలోవ సిఐ సోమశేఖర్ కథనం ప్రకారం... ఆరిలోవ కాలనీ, శివాజీనగర్ ప్రాంతానికి చెందిన బాలిక (8) నాలుగో తరగతి చదువుతుంది. ఓ వ్యక్తి ఆదివారం సాయంత్రం బాలికను ద్విచక్రవాహనంపై ఆరిలోవ 40 గజాల ప్రాంతం వైపు తీసుకొని వెళ్లాడు. అక్కడ ఆ చిన్నారిపై అసభ్యంగా ప్రవర్తించాడు. చిన్నారి ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలపడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. చిన్నారిపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తి కోసం పోలీసులు ప్రధాన కూడళ్లలో సిసి పుటేజీలు పరిశీలిస్తున్నారు.

## ల్యాండ్ పూలింగ్ అక్రమాల ఆరోపణలపై గ్రామసభ

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని తునివలస పంచాయతీ పరిధి నరసాపురంలో జగనన్న లే-అవుట్లకు సేకరించిన భూమి విషయంలో వచ్చిన ఆరోపణలపై భీమిలి ఆర్‌డిఒ భాస్కర్‌రెడ్డి నేతృత్వంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. గంధవరం, అనంతవరం, రెడ్డిపల్లి, కొవ్వాడ, నేరెళ్లవలస గ్రామాలకు చెందిన 313 మంది రైతులకు సంబంధించిన భూముల్లో జెడ్‌పిటిసి గిరిబాబు అక్రమాలు చేసినట్లు వచ్చిన ఆరోపణలపై రైతులతో మాట్లాడారు. దీనిపై రైతులు సంకర గిరిబాబుపై ఎటువంటి ఆరోపణలు చెయ్యలేదు. దీంతో రైతులనుంచి గిరిబాబు భూమి కొనుగోలు చేసినట్లు నిర్ధారించారు. జగనన్న లే-అవుట్ల కోసం రైతుల వద్ద తీసుకున్న భూమికి తిరిగి ప్రభుత్వం ఇవ్వాల్సిన భూమి రైతులకు ఇవ్వక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని నిర్ధారించారు. త్వరలోనే రైతులకు భూమి ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమములో మాజీ ఎమ్మెల్సీ పివిఎన్.మాధవ్, తహశీల్దార్ తోట శ్రీవల్లి, డీటీ కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

# సిపిఎం నేత సుబ్బారావుకు నివాళి

ప్రజాశక్తి-యంత్రాంగం : సిపిఎం సీనియర్ నాయకులు జి.సుబ్బారావు సంతాప సభలు నగరంలో పలుచోట్ల సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**అరుణోదయ కాలనీలో సంతాప సభ**

**గాజువాక :** అరుణోదయ కాలనీలో జి.సుబ్బారావు సంతాప సభ సోమవారం సాయంత్రం నిర్వహించారు. సుబ్బారావు చిత్రపటానికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.రాజేంద్రప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నమ్మిన సిద్ధాంతం కోసం చివరి వరకు పోరాడిన వ్యక్తి సుబ్బారావు అని కొనియాడారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, కృష్ణ, శ్రీదేవి, పార్టీ సానుభూతిపరులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**సమైక్య అపార్ట్‌మెంట్‌లో...**

సిపిఎం సీనియర్ నాయకులు, ఉద్యమ నేత జి.సుబ్బారావు సంతాప సభ సోమవారం సమైక్య అపార్ట్‌మెంట్ లైబ్రరీ హాల్లో నిర్వహించారు. సుబ్బారావు చేసిన సేవలను, అపార్ట్‌మెంట్ సమస్యలపై అందించిన సహకారాన్ని గుర్తు చేసుకుంటూ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సమైక్య అపార్ట్‌మెంట్ కమిటీ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరావు, సెక్రెటరీ పి.తవిటయ్య, మహిళా కమిటీ ప్రెసిడెంట్ మణి, కమిటీ సభ్యులు రామన్న, భాస్కరరావు, గౌరవ్, ప్రసాద్, శంకరరావు పాల్గొన్నారు.

**మధురవాడ :** ఎపి మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) మధురవాడ కమిటీ ఆధ్వర్యాన చంద్రంపాలెం హైస్కూల్‌లో సిఐటియు సీనియర్ నాయకుడు జి.సుబ్బారావు సంతాప సభ సోమవారం నిర్వహించారు. సుబ్బారావు చిత్రపటానికి నక్క అప్పారావు పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎంవి.ప్రసాద్ మాట్లాడుతూ, మున్సిపల్ కార్మికుల సమస్యలపై సుబ్బారావు అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు కె.నాగరాజు, యూనియన్ నాయకులు ఎస్.రామప్పడు, సిహెచ్.శేషుబాబు, కొండమ్మ, జి.కిరణ్, బి.రాంబాబు, కె.రాజు, కె.అర్జునమ్మ పాల్గొన్నారు.

సమైక్య అపార్ట్‌మెంట్‌లో నివాళులర్పిస్తున్న వెంకటేశ్వరరావు తదితరులు

మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎన్.రామారావు

## పెంటమాంబ పండగలో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి -యంత్రాంగం

**గాజువాక :** పెంటమాంబ అమ్మవారి వార్షికోత్సవం సందర్భంగా స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్, ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన భక్తులకు మజ్జిగ పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు సీనియర్ నాయకులు ఎన్.రామారావు మాట్లాడుతూ, కేవలం పోరాటాలకే పరిమితం కాకుండా సేవా కార్యక్రమాలు కూడా చేయడం సిఐటియుకే సాధ్యమన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం, మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలందరూ ఐక్యంగా పోరాటాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నమ్మి రమణ, పాల అప్పలరెడ్డి, జి.శ్రీనివాసరావు, వై.అప్పారావు, సిహెచ్.రాముడు, బి.ఆనంద్, కణితి అప్పలరాజు, కె.మల్లేశ్వరరావు, అప్పలరాజు, సురేష్, చిన్నారులు గీతిక, సింధు పాల్గొన్నారు.

**చోడవరం :** రాక్ ఫ్రెండ్స్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక విగ్నేశ్వర ఆలయం వద్ద ఆదివారం పెద్ద ఎత్తున మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. మెయిన్ రోడ్డు వద్ద ఏర్పాటు చేయడంతో అటుగా వెళ్లే పాదచారులు, వాహనదారులు మజ్జిగతో తమ దాహార్తిని తీర్చుకున్నారు. అకాలంగా మృత్యువాత పడిన తమ స్నేహితుల జ్ఞాపకార్థం ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు యువకులు తెలిపారు.

## దళిత బ్యాగుల వ్యాపారి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 60వ వార్డు పరిధి శ్రీహరిపురం గొల్లలపాలెం మార్కెట్ చింతచెట్టు కింద బ్యాగుల వ్యాపారం చేసుకుంటున్న దళితుడు ములగాడ కనకరాజు షాపును రాజకీయ కక్షతో తొలగించారంటూ చేసిన ఆందోళనలపై పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ స్పందించారు. శ్రీహరిపురం హాకర్‌జోన్‌లో ఆనంద్‌కుమార్ సొంత నిధులతో షాపు నిర్మించి ఇస్తానని, చింత చెట్టు కింద ఖాళీ స్థలం కూడా వాడుకునేలా చూస్తానని ఆనంద్‌కుమార్ హామీ ఇచ్చారు. దీంతో కనకరాజు ఆనందం వ్యక్తంచేశాడు. కొన్ని సంవత్సరాలుగా ఇక్కడ వ్యాపారం చేసుకొంటూ కనకరాజు తన భార్య, ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తున్నారని, రాజకీయ కక్షలతో షాపును ధ్వంసం చేయడంపై స్థానికులు కూడా ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-సీతమ్మధార : అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఉత్తర నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో వైసిపి సమన్వయకర్త కెకె.రాజు సోమవారం పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గ పరిధిలో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సుమారు రూ.5,80,000 విలువైన చెక్కులను అందజేసినట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ పరిధిలోని వ్యాధులతో బాధపడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్‌కుమార్, కార్పొరేటర్ అనీల్‌కుమార్‌రాజు, యువజన విభాగం రీజనల్ ఇన్‌ఛార్జి సునీల్, కెవి.బాబా, సుశీల వెంకటేష్, హరి పాల్గొన్నారు.

## 14 నుండి సముద్రంలో చేపల వేట నిషేధం

ప్రజాశక్తి -అనకాపల్లి : ఈ నెల 14 నుంచి జూన్ 15వ తేదీ వరకు 61 రోజులపాటు యాంత్రిక, మర బోట్లతో సముద్రంలో చేపల వేటను నిషేధిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి పి.లక్ష్మణరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సముద్రంలో మత్స్య సంపద పరిరక్షణ, వృద్ధి నిర్వహణలో భాగంగా ప్రతి ఏటా ఈ నిషేధం అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సాంప్రదాయ బోట్లకు ఈ విషయంలో మినహాయింపు ఉంటుందన్నారు. చేపల వేట నిషేధ సమయంలో దీనిపై ఆధారపడ్డ మత్స్యకార కుటుంబాలకు వైయస్సార్ మత్స్యకార భరోసా కింద రూ.10వేలు జీవన భృతి చెల్లించడం జరుగుతుందని చెప్పారు. ఈ పథకం గత ఏడాది అక్టోబర్ 14వ తేదీకి ముందు రిజిస్టర్ చేసుకున్న వ్యాలిడ్ లైసెన్స్ బోట్లకు వర్తిస్తుందని తెలిపారు. ఈ పథకం నిబంధనలు అర్హతలు తీర ప్రాంత సమీపంలో ఉన్న సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచడం జరిగిందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు గ్రామ సచివాలయ ఫిషరీస్ అసిస్టెంట్ లేదా మత్స్యశాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు.

# 20న ఎంపీ ఇంటి ముందు పెన్షనర్ల భిక్షాటన

సమావేశంలో మాట్లాడుతున్న దీనబంధు

ప్రజాశక్తి -ములగాడ : పెన్షనర్ల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 20న విశాఖ ఎంపీ ఎంవివి.సత్యనారాయణ ఇంటి ముందు భిక్షాటన చేపట్టనున్నట్లు పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు కె.దీనబంధు తెలిపారు. వెంకన్నపాలెంలోని సిఐటియు కార్యాలయంలో సోమవారం ఇపిఎఫ్-95 పెన్షనర్ల సమావేశం నిర్వహించారు. సిహెచ్.తమ్మారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో దీనబంధు మాట్లాడుతూ, కనీస పెన్షన్ రూ.9 వేలు, డిఎ, భార్యాభర్తలిద్దరికీ ఇఎస్ఐ సదుపాయం కల్పించాలని కోరుతూ ఎంపీ ఇంటి ముందు భిక్షాటన చేస్తూ గిన్నెలతో తాళాలు కొట్టి నిరసనను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్లు పెద్ద ఎత్తున పాల్గొని నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. పెన్షనర్ల సమస్యపై హ్యూమన్ రైట్స్ కమిషన్‌కు లేఖ రాస్తామని చెప్పారు. పెన్షనర్ల సంఘం మల్కాపురం జోన్ కార్యదర్శి కె.నూకరాజు మాట్లాడుతూ, హయ్యర్ పెన్షన్ గురించి గందరగోళంగా ఉందన్నారు. ఇపిఎఫ్ లింకు ఓపెన్ కావడంలేదని, ఇచ్చిన వివరాలు పూరించటం కష్టంగా ఉందని, దీనిపై పిఎఫ్ కమిషనర్ స్పష్టత ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్.సూర్యారావు, కె.అప్పారావు, పెన్షనర్లు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందాలి

ప్రజాశక్తి -యంత్రాంగం

**ములగాడ :** ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందాలని పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. జివిఎంసి 59వ వార్డు పరిధిలో జగనన్నే మా భవిష్యత్, గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించారు. వైసిపి వార్డు అధ్యక్షులు పుర్రె సురేష్, ఇన్‌ఛార్జి రేవల్లు సత్యనారాయణతో కలిసి ఆనంద్‌కుమార్ హిమాచల్‌నగర్‌లో ఇంటింటికీ వెళ్లారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆరాతీశారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత ఉద్యోగులకు తగు సూచనలు చేశారు.

అనంతరం 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణితో కలిసి ఇంటింటికీ తిరిగారు. ఈ కార్యక్రమంలో బి.కృపా, కలిదిండి బద్రీనాద్, బల్ల లక్ష్మణరావు, పిల్లా కన్నబాబు, నమ్మి శ్రీను, పొట్టి మూర్తి, గాలి సన్యాసిరావు, వి.కృష్ణఅప్పారావు నాయుడు, భూపతిరాజు పెద్దిరాజు పాల్గొన్నారు.

**'మా నమ్మకం నువ్వే జగన్'**

**ఆరిలోవ :** 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని జివిఎంసి 10, 12, 13 వార్డుల పరిధిలో సోమవారం నిర్వహించారు. 10 వార్డు వైసిపి ఇన్‌ఛార్జి జగ్గుపిల్ల అప్పలరాజు ఆధ్వర్యాన బిఆర్‌ఆర్‌నగర్‌లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు తీరును, స్థానిక సమస్యలనడిగి తెలుసుకున్నారు. 12వ వార్డు పరిధి దుర్గానగర్‌లో కన్నేటి సుబ్బారెడ్డి ఆధ్వర్యాన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అల్లంపల్లి రాజబాబు, చొక్కర శేఖర్, పిఐ బాలరాజు, అర్జున్, శ్రీను, రాజులమ్మ పాల్గొన్నారు. 13వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి కెల్ల సత్యనారాయణ ఆధ్వర్యాన ఆరిలోవ కాలనీలో ఇంటింటికీ వెళ్లారు. పథకాల అమలు తీరుపై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పిల్ల వీర్రాజు, బేతా దుర్గారావు, పాండ్రంకి శ్రీను పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఆనంద్‌కుమార్, కల్యాణి

### ప్రచార రథం ప్రారంభం

**సీతమ్మధార :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు ఆళ్ల శివగణేష్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన 'జగనన్నే మా భవిష్యత్' ప్రచార రథాన్ని ఉత్తరాంధ్ర జిల్లాల వైసిపి రీజినల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి సోమవారం తాటిచెట్లపాలెం అభయ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్‌బాబు, డిప్యూటీ మేయర్ సతీష్, మత్స్యకార కార్పొరేషన్ ఛైర్మన్ కోలా గురువులు, బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్, వైసిపి నాయకులు బొడ్డేటి కాశీ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

## 'ఉత్తరం'లో గ్రీవెన్స్

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు వైసిపి సమన్వయకర్త కెకె.రాజు పార్టీ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన పలువురు కార్యాలయానికి విచ్చేసి సమస్యలతో కూడిన వినతులను కెకె.రాజుకు అందించారు. వినతిపత్రాలను పరిశీలించిన కెకె.రాజు అధికారులతో మాట్లాడి కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. మరికొన్నింటిని సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## అక్రమ నిర్మాణాల తొలగింపు

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 23వ వార్డు పరిధి చైతన్యనగర్‌లో ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మిస్తున్న ఇళ్ల కాలమ్స్‌ను టౌన్‌ప్లానింగ్ అధికారులు సోమవారం తొలగించారు. ఈ సందర్భంగా టిపిఎస్ తేజ మాట్లాడుతూ, అనధికారికంగా నిర్మిస్తున్న భవనాలను గుర్తించి తొలగిస్తున్నట్లు చెప్పారు. భవన నిర్మాణదారులు అనుమతి తీసుకున్న ప్లాన్ ప్రకారం నిర్మాణం సాగించాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. వార్డు ప్లానింగ్ సెక్రటరీలు రాజేష్, యుగంధర్, గాయత్రి, సాయి, రవి, హరీష్ పాల్గొన్నారు.

## రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు మరమ్మతు పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. గోతులు పడిన ఈ రహదారిలో నల్లపిక్క, తారుతో గోతులను పూడ్చుతున్నారు. ఈ మరమ్మతు పనులకు రూ.80 లక్షల నిధులు మంజూరైనట్లు ఇటీవల ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు చెప్పిన విషయం తెలిసిందే. మంజూరైన నిధులతో పనులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. గోతులను పూడ్చడంతో వాహన దారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని కింతాడ శివారు గొల్లలపాలెం, ఎ.కోడూరు శివారు పొడుగుపాలెం అంగన్వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టులు భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపిడిఓ కె.శశిదేవి మంగళవారం తెలిపారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ విడుదల చేసిన జీవో ప్రకారం ఈనెల 17వ తేదీలోగా అర్హత గల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

# ధర్నాలతో దద్దరిల్లిన కలెక్టరేట్

## పలు సమస్యలపై స్పందనలో వినతులు

ఫైవుడ్ కంపెనీ ముఠా కార్మికుల ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు నేత కోటి

ప్రజాశక్తి - అనకాపల్లి

జిల్లాలోని పలు సమస్యలపై సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నాలు జరిగాయి. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు.

**ఫైవుడ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని..**

**అనకాపల్లి :** అచ్యుతాపురం మండలం ఎస్ఈజెడ్ పరిధిలో ఉన్న రుషిల్ డెకార్ ఫైవుడ్ కంపెనీలో పనిచేస్తున్న ముఠా కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట సిఐటియు ఆధ్వర్యాన సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ కంపెనీ యాజమాన్యం ముఠా కార్మికులకు గత వారం రోజులుగా పనులు కల్పించకుండా రోడ్డున పడేసిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే కన్నబాబురాజు కార్మికులకు పనులు కల్పించాల్సింది పోయి, ఉన్న పనులను తొలగించి కార్మికుల పొట్టకొట్టడం దుర్మార్గమన్నారు. రసూల్ యాజమాన్యం పాత పద్ధతిలోనే ముఠా కార్మికులకు కూలి రేట్లు చెల్లించి అందరిని పనిలోకి పెట్టుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం స్పందనలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రొంగలి రాము, గనిశెట్టి సత్యనారాయణ, నాయకులు కూండ్రపు సోము నాయుడు, చెరుకు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్రి అప్పారావు, నిర్వాసితుల సంఘం నాయకులు బుద్ద రంగారావు, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

**వైజాగ్- చెన్నై కారిడార్ నిర్వాసితులకు ఒకే విధమైన నష్టపరిహారం చెల్లించాలని...**

**అనకాపల్లి :** విశాఖపట్నం- చెన్నై పారిశ్రామిక కారిడార్ నిర్వాసితులకు ఒకే విధమైన నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, అమలాపురం గ్రామ సర్పంచ్ శంకర్రావు డిమాండ్ చేశారు. నిర్వాసితులతో కలిసి కలెక్టరేట్ ముందు సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టి, అనంతరం స్పందనలో జెసి కల్పనాకుమారికి వినత పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నక్కపల్లి మండలంలోని న్యాయంపూడి, కాగిత, వేంపాడు గ్రామాల్లో భూములు సేకరించి 150 అడుగుల రోడ్డు నిర్మించేందుకు ఏపీఐఐసీ ప్రయత్నిస్తోందని తెలిపారు. తమ గ్రామాలకు ఆనుకుని ఉన్న రాజయ్యపేట నుంచి దోనివానిలక్ష్మీపురం వరకు ఐదు రెవెన్యూ గ్రామాల్లో 5500 ఎకరాలు సేకరించి ఒకే విధమైన నష్టపరిహారం చెల్లించినట్లు చెప్పారు. కాని తమ మూడు గ్రామాలకు వేరువేరుగా నష్ట పరిహారం చెల్లించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. భూములు కోల్పోయిన ప్రతి కుటుంబానికి ఒక ఆర్ కార్డు ఇచ్చి శాశ్వత ప్రాతిపదికన ఉపాధి ఇవ్వాలని, 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ప్యాకేజీలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ భూ సేకరణ కొరకు నియమించబడిన ప్రత్యేక ఉప కలెక్టర్ రైతులను బెదిరించే ధోరణి విడనాడాలన్నారు. తమ డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు భూముల్లోకి అధికారులను అనుమతించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రావి చిన్ని, రోకలి శ్రీను, పెంటకోట నరసింగరావు, నాగనబోయిన ఈశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న శంకరం గ్రామస్తులు

**శంకరం గ్రామస్తుల ఆందోళన**

**అనకాపల్లి :** అనకాపల్లి మండలం శంకరం గ్రామ సర్వేనెంబర్ 29, రేబాక సర్వేనెంబర్ 99లో నిర్ణీత సరిహద్దులు పోల్చకుండా ఉన్న ఉమ్మడి స్థలంలో ఇల్లు లేని 26 మంది గ్రామస్తులకు ఎల్పీసీలు ప్రభుత్వం మంజూరు చేయగా, రెండవ వార్డు సభ్యులు కరణం భవాని భర్త శంకర్రావు కొంతమందితో కలిసి తనకు ఇళ్ల స్థలం ఇవ్వాలని, లేకుంటే తగిన పారితోషికం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ లబ్ధిదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నందున ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలని సోమవారం కలెక్టరేట్ ముందు గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. దీనిపై పలుమార్లు స్పందన కార్యక్రమంలో అర్జీలను ఇస్తామని, ఇప్పటికైనా అధికారులు స్పందించి తప్పుడు ప్రచారాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని జెసి కల్పనా కుమారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పసుపులేటి లక్ష్మి, గ్రామ వైసిపి నాయకులు పసుపులేటి రామకృష్ణ, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వైజాగ్-చెన్నయ్ కారిడార్ నిర్వాసితులు

## స్పందనకు 250 అర్జీలు

**అనకాపల్లి :** జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి 250 దరఖాస్తులు అందాయి. వాటిని జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, డిఆర్ఓ వెంకటరమణ, డిఆర్డిఎ పిడి లక్ష్మీపతి స్వీకరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ స్పందనలో వచ్చే అర్జీలకు సంబంధిత అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని, అవి పదేపదే స్పందనకు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**ఎస్పీ కార్యాలయంలో 32....**

ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి 32 ఫిర్యాదులు వచ్చాయి. అదనపు ఎస్పీ విజయభాస్కర్ ఫిర్యాదులను నేరుగా స్వీకరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి చట్ట పరిధిలో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. భూతగాదాలు కుటుంబ కలహాలు, చీటింగ్ కేసులకు సంబంధించి ఫిర్యాదులు వచ్చాయి.

**అనకాపల్లి-అచ్యుతాపురం రహదారి పనులకు వినతి**

**అనకాపల్లి :** అనకాపల్లి -అచ్యుతాపురం రహదారి పనులను తక్షణమే ప్రారంభించాలని, అంతవరకు భారీ వాహనాలను నిలుపుదల చేయాలని సిపిఎం అచ్యుతాపురం మండల నాయకులు సోమవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు బుద్ద రంగారావు, కర్రి అప్పారావు, ఆర్ రాము మాట్లాడుతూ ఈ రోడ్డు 70 గ్రామాలకు అనుసంధానం కలిగి ఉందని, ఎస్ఇజెడ్ కంపెనీల వల్ల ట్రాఫిక్ విపరీతంగా పెరిగిందని తెలిపారు. దీని వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతూ పలువురు మరణించారని, చాలామంది అవయవాలు కోల్పోయారని పేర్కొన్నారు. ఎస్ఇజెడ్ కంపెనీలకు ప్రత్యామ్నాయంగా మరో రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు.

**ఎల్లయ్య కాలువల ఆక్రమణలను తొలగించాలని...**

**అనకాపల్లి :** అనకాపల్లి చెర్లోపల్లి, ఎల్లయ్య కాలువల ద్వారా సుమారు 4500 ఎకరాల పంట భూములకు సాగునీరు అందుతుందని, ఆ కాలువలకు ఇరువక్కల ఆక్రమణల వల్ల సాగునీరు అందక రైతులు నష్టపోతున్నారని, తక్షణమే ఆక్రమణలు తొలగించాలని కోరుతూ సోమవారం అనకాపల్లి వ్యవసాయదారుల సంఘం ఆధ్వర్యంలో జెసి కల్పనాకుమారికి వినతి పత్రం అందజేశారు. అనకాపల్లి-ఆనందపురం రోడ్డు జంగల మధుమ వద్ద నిర్మిస్తున్న ఎనిమిది ఆరాధ్య గ్రీనరీ, ఆర్ఓబి, ఇంటర్ చేజింగ్ పైపు కల్వర్టు కారణంగా ఉత్తర ఆవకండం భూములు సుమారు 80 ఎకరాలు జీవీఎంసీ మురుగునీరు వల్ల పాడైపోతున్నాయని తెలిపారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సంఘం కార్యదర్శి భీశెట్టి కృష్ణ అప్పారావు, కాండ్రేగుల విశ్వేశ్వరరావు, ఎంఎన్ఎస్ అప్పారావు ఉన్నారు.

జెసికి సమస్యను వివరిస్తున్న వ్యవసాయదారుల సంఘం నేతలు

## ఇంటి నిర్మాణాన్ని అడ్డుకున్న సర్పంచ్, విఆర్ఒలపై ఫిర్యాదు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

తన జిరాయితీ భూమిలో నిర్మించుకుంటున్న ఇంటి నిర్మాణాన్ని స్థానిక సర్పంచ్, వీఆర్వో అడ్డుకుంటున్నారని, వారిరువురుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండలంలోని నీలకంఠాపురం గ్రామానికి చెందిన గొలుకుండ మరిడినాయుడు సోమవారం అనకాపల్లి కలెక్టరేట్లో జరిగిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీలకంఠాపురం రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 428-6లో తనకు పది సెంట్లు సాగు జిరాయితీ భూమి ఉందని, అందులో పది రోజుల క్రితం ఇంటి నిర్మాణానికి పునాది తీస్తుండగా స్థానిక సర్పంచ్, విఆర్ఓ నిర్మాణాలు అడ్డుకున్నారని తెలిపాడు. ఇంటి నిర్మాణాన్ని అడ్డుకున్న విషయమై తహశీల్దారుకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. తన సాగు భూమిలో ఇంటి నిర్మాణాన్ని అడ్డుకున్న ఇరువురిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

స్పందనలో ఇచ్చిన ఫిర్యాదును చూపుతున్న మరిడినాయుడు

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఐ ఆదినారాయణరెడ్డి

## చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - కశింకోట

కశింకోట మండలం తాళ్ళపాలెం జంక్షన్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్ఐ ఆదినారాయణ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సేవ భావం కలిగి ఉండాలన్నారు. ఈ చలివేంద్రం వల్ల బాటసారులు, వాహనదారులు దాహార్తి తీర్చుకుంటారన్నారు. దీనిని ఏర్పాటు చేసిన శ్రీనివాసరావును అభినందించారు. ఈ కార్యక్రమంలో లగిశెట్టి గణేష్, స్థానికులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో కూడిన విద్యతో ఉత్తమ ఫలితాలు

**- డిఇఒ వెంకట లక్ష్మమ్మ**

ప్రజాశక్తి- వడ్డాది

క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తే ఉత్తమ ఫలితాలను సాధించవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మి తెలిపారు. బుచ్చయ్య పేట మండలం వడ్డాది కేజీబీవీ ఉన్నత పాఠశాలను సోమవారం ఆమె పరిశీలించారు. కేజీబీవీలో భోజనం మెనూను పరిశీలించారు. భోజనం రుచి చూశారు. 10వ తరగతి విద్యార్థినులతో మాట్లాడి పరీక్షలు జరిగే విధానం, రాసే పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ ఏకాగ్రతతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. అనంతరం టాయిలెట్స్ క్లాస్ రూమ్స్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. విద్యార్థులు చదువుతున్న విధానం స్కూల్ పరిసరాలను వాతావరణాన్ని సిబ్బంది పనితీరును చూసి ఆనందించారు. ఆమె వెంట ఎంఈఓ చంద్రశేఖర్, సిఆర్పి కుమార్, ఎస్ఓ కోసూరి అన్నపూర్ణ తదితరులు ఉన్నారు.

విద్యార్థునులతో మాట్లాడుతున్న డిఇఒ వెంకటలక్ష్మమ్మ

## అభివృద్ధికి రోల్ మోడల్ అవుతా : ఎంవిఆర్

ముత్యాల వెంకటేశ్వర రావును సత్కరిస్తున్న చోడవరం నియోజకవర్గం నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి

తాను రాజకీయాల్లోకి వచ్చేది పక్కా అని, ప్రజా నాయకునిగా అభివృద్ధి అనే పదానికి రోల్ మోడల్ అవుతానని ప్రముఖ వ్యాపారవేత్త, ముత్యాల గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక విజయ రెసిడెన్సీలో సోమవారం చోడవరం నియోజకవర్గ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎంపీగా పోటీ చేస్తామని, తద్వారా నియోజకవర్గాన్ని మిగిలిన నాయకులకు భిన్నంగా అభివృద్ధి చేసి చూపిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంవిఆర్ తనయుడు సతీష్, ఎంవిఆర్ పార్లమెంటరీ నియోజకవర్గం కార్యదర్శి చెక్కల శ్రీను, చోడవరం నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

# తొలి తరం సిపిఎం నాయకులు దొడ్డి రామునాయుడుకు ఘన నివాళి

ప్రజాశక్తి-అనకాపల్లి

రైతాంగ, కార్మిక వర్గాల సమస్యల పరిష్కారం కోసం పోరాడిన తొలి తరం సిపిఎం నాయకులు కామ్రేడ్ దొడ్డి రాము నాయుడుకు ఆ పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక దొడ్డి రామునాయుడు కార్మిక కర్షక నిలయంలో సోమవారం రామునాయుడు 40వ వర్థంతి కార్యక్రమం నిర్వహించారు. సిపిఎం సీనియర్ నాయకులు ఎ.బాలకృష్ణ, మండల కన్వీనర్ గంట శ్రీరామ్, సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్ శంకర్రావు, జి కోటేశ్వరరావు రామునాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ తొలితరం కమ్యూనిస్టు నేతలను స్ఫూర్తిగా చేసుకుని దొడ్డి రామునాయుడు అప్పటివరకు తాను నిర్వహిస్తున్న వ్యాపారాలను విడిచిపెట్టి, పార్టీ పూర్తి కాలం కార్యకర్తగా రైతాంగ కార్మిక సమస్యలపై పోరాటాలు చేశారని గుర్తు చేశారు. కమ్యూనిస్టు ఉద్యమంలో వచ్చిన అతివాద మితవాద పోకడలను కాదని వాస్తవ దృక్పథంతో వ్యవహరిస్తున్న సిపిఎంలో చేరి విశాఖ జిల్లాకు కార్యదర్శిగా పనిచేశారని చెప్పారు. ఆయన తుది శ్వాస విడిచే వరకు ఎర్రజెండాను మహోన్నత స్థానంలో నిలిపేందుకు కృషి చేశారన్నారు. పార్టీ కార్యకర్తలను తమ సొంత బిడ్డల్లా భావించి వారి అభివృద్ధికి ఉద్యమ పురోభివృద్ధికి ఎనలేని సేవ చేశారని కొనియాడారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రభుత్వ నిర్లక్ష్యాలను నిరసిస్తూ వారికి ఉపశమన చర్యల కోసం అనేక కార్యక్రమాలు నిర్వహించారని గుర్తు చేశారు. ప్రభుత్వం బెల్లం క్రషర్లపై ఆంక్షలు విధించినప్పుడు రైతాంగం పక్షాన నిలబడ్డం, ఎరువులు కృత్రిమ లోటు కల్పించినప్పుడు గోడౌన్లను బద్దలు కొట్టి రైతులకు ఎరువులు పంపిణీ చేసిన ఘనత కామ్రేడ్ రామునాయుడుకే దక్కుతుందన్నారు. ఆయనను స్ఫూర్తిగా చేసుకుని నేటి కార్యకర్తలు పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎ.రాజు, ఉమామహేశ్వరరావు, గనిశెట్టి సత్యనారాయణ, కర్రి అప్పారావు, బుద్ధ రంగారావు, బి నూక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

దొడ్డి రామునాయుడు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

తీర్థయాత్రకు బయలుదేరిన మహిళలతో ఎంవిఆర్

## ఎంవిఆర్ ఉచిత తీర్థ యాత్ర పునఃప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి గవరపాలెం మహిళ భక్తుల కోరిక మేరకు ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు ఉచిత తీర్థ యాత్రను సోమవారం ప్రారంభించారు. 10 గ్రామాలకు చెందిన భక్తులు సింహాచలం, అన్నవరం, కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానాలను దర్శించుకుంటారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. వృద్ధులకు ఇది మంచి అవకాశమని, యాత్ర సమయంలో భక్తులకు ఉచిత భోజనం, ఉదయం, సాయంత్రం అల్పాహారం, మంచినీటి వసతి కల్పించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంవిఆర్ యువసేన పార్లమెంట్ నియోజకవర్గ కార్యదర్శి చెక్కల శ్రీను, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు సదరం శిబిరం

ప్రజాశక్తి-కె.కోటపాడు : వికలాంగులకు సదరం సర్టిఫికెట్ల మంజూరుకు సదరం క్యాంపును మంగళవారం నిర్వహిస్తున్నట్లు స్థానిక 50 పడకల ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి మంగళవారం ఆర్థోపెడిక్ వైద్యులు నందకిషోర్ ఆధ్వర్యంలో ఈ శిబిరం ఉంటుందని, వారానికి 20 మంది వికలాంగులకు మాత్రమే సర్టిఫికెట్లు జారీ చేస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## సర్వే రాళ్లు ఏర్పాటు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

భూ సమగ్ర సర్వే కార్యక్రమంలో భాగంగా మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో సోమవారం 2020 సర్వే ఆధారంగా గ్రామ సరిహద్దులలో సర్వే రాళ్లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎస్ భాగ్యలక్ష్మి బాబు నాయుడు, ఉప సర్పంచ్ భీసెట్టి రాము, ఎస్ గోవిందా, ఎస్ రమేష్, సర్వేయర్ ప్రశాంత్, విఆర్‌ఓ మోహన్, వీఆర్‌ఏ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సర్వే రాళ్లకు పూజ చేస్తున్న గ్రామ నాయకులు

# విద్యుత్ ఛార్జీల పెంపుపై టిడిపి నిరసనలు

చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి-యంత్రాంగం

**రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల పెంపు, వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ టిడిపి ఆధ్వర్యాన జిల్లాలో పలుచోట్ల సోమవారం నిరసనలు తెలిపారు.**

**తగరపువలస** : చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట టిడిపి నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు మాట్లాడుతూ, ఈ నాలుగేళ్ల వైసిపి పాలనలో 7సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై రూ.57వేల కోట్ల భారం మోపారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు డిఎవిఎన్.రాజు, సరగడ అప్పారావు, కోరాడ రమణ, తమ్మిన వెంకటరమణ పాత్రుడు, టి.సూరిబాబు, బడిగింటి నీలకంఠం, చిలకా నరసింగరావు, ఎంవి గురుమూర్తి, పతివాడ రాంబాబు, దండి వెంకటేష్, వానపల్లి సత్య, గిడుతూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముందు జంక్షన్‌లో బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జంక్షన్ నుంచి చిట్టివలస విద్యుత్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు.

భీమిలిలో కృష్ణా కాలనీ విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట టిడిపి 3,4 వార్డుల కమిటీల ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, మూడో వార్డు ప్రధాన కార్యదర్శి గొలగాని నరేంద్ర కుమార్, మాజీ సర్పంచ్ కారి అప్పారావు, నాయకులు కనకల అప్పల నాయుడు, ఎస్.జోగారావు తదితరులు పాల్గొన్నారు.

**పెందుర్తి** : పెందుర్తి సబ్ స్టేషన్ వద్ద టిడిపి నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పలనాయుడు మాట్లాడుతూ, మాట తప్పను.. మడం తిప్పను.. అంటే ఛార్జీలు బాదడమేనా అని ఎద్దేవాచేశారు.

**మధురవాడ** : 8వ వార్డు పరిధిలోని ఎండాడ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వార్డు టిడిపి అధ్యక్షుడు శెట్టిపల్లి గోపి ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో బోడపాటి దొరబాబు, సార్‌పల్లి శ్రీనివాసు, అక్కరబోయిన రాంబాబు,ఉప్పులూరి గోవిందరావు, చిన్న గోపి, పరమేశ్వరరావు, ఒమ్మి బాబూరావు, శెట్టిపల్లి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద జివిఎంసి 5, 6, 7 వార్డుల అధ్యక్షులు, కార్పొరేటర్లతో కలిసి భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో 5, 7 వార్డుల కార్పొరేటర్లు మొల్లి హేమలత, పిల్లా మంగమ్మ, నాయకులు సత్యనారాయణ, దాసరి శ్రీనివాస్, పిల్లా నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

**ఆనందపురం** : ఆనందపురం విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఎఇ సురేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బోర్డపు శ్రీనివాస్, మీసాల సత్యనారాయణ, తాత్రాజు అప్పారావు, కర్రి శ్రీనివాసరావు, విఆర్‌కె.రాజు, కొట్యాడ రెడ్డిబాబు, షినగం రామకృష్ణ, పడాల అప్పలనాయుడు, బంటుబిల్లి అప్పలస్వామి, లోడగల వెంకట్రావు, షినగం శివ, బలిరెడ్డి మల్లికార్జునరావు, వానపల్లి ముత్యాలరావు, బోని ప్రసాద్, మరుపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**కలెక్టరేట్** : రాష్ట్ర ప్రభుత్వం భారీగా పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని టిడిపి దక్షిణ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ డిమాండ్ చేశారు. సోమవారం ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట టిడిపి కార్యకర్తలు ఆయన ఆధ్వర్యంలో మోకాళ్ళపై నిలబడి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పరిపాలన చేతగాని సిఎం గద్దె దిగాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ దక్షిణ నాయకులు పొడుగు కుమార్, విల్లూరి డాక్టర్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

**యలమంచిలి** : రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని కోరుతూ మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు ఆధ్వర్యాన సోమవారం ర్యాలీ నిర్వహించి, విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత 7 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి సామాన్యుల నడ్డి విరిచిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు విజయబాబు, ఇత్తంశెట్టి రాజు, నాగేశ్వరరావు, శివనారాయణ, రమణబాబు పాల్గొన్నారు.

వడ్డాదిలో ర్యాలీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజు, తాతయ్యబాబు తదితరులు

**అనకాపల్లి** : వైసిపి పాలనలో విద్యుత్తు కొనుగోలులో వేలకోట్ల రూపాయల అవినీతి జరిగిందని, జగన్ రెడ్డి చేసుకున్న విద్యుత్ ఒప్పందాలన్నీ దొంగ లెక్కలేనని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ విమర్శించారు. పెంచిన విద్యుత్ ఛార్జీలకు నిరసనగా స్థానిక ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. వైసిపి ప్రభుత్వం చేసుకున్న విద్యుత్ ఒప్పందాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మళ్ల సురేంద్ర, జోగినాయుడు, పోలవరపు త్రినాథ్, సబ్బవరం గణేష్, షేక్ బాబర్, ధనాల విష్ణు చౌదరి, సూరే సతీష్ పాల్గొన్నారు.

**అచ్యుతాపురం** : విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ అచ్యుతాపురం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద టిడిపి నాయకులు సోమవారం ఆందోళన చేపట్టారు. దీనికి ముందు అచ్యుతాపురం జంక్షన్ నుంచి ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ప్రగడ నాగేశ్వరరావు, జనపరెడ్డి నర్సింగరావు, లాలం నాగేశ్వరరావు, లాలం రాజు, మామిడి శివ అప్పారావు, నీరుకొండ నర్సింగరావు, ప్రతివాడ చిన్నయ్య నాయుడు, రాజాన నానాజీ ధర్మిరెడ్డి ప్రసాద్, జూనియర్ నాగేశ్వరరావు, కర్రి రమణ పాల్గొన్నారు.

**వడ్డాది** : రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను పెంచి ప్రజలపై అధిక భారాన్ని మోపుతుందని మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంపునకు వ్యతిరేకంగా వడ్డాది జంక్షన్లో ర్యాలీ సోమవారం నిర్వహించారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్యబాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మాడుగులలో నిరసన ర్యాలీ చేస్తున్న కుమార్ తదితరులు

**మాడుగుల** : పరిశ్రమలకు విద్యుత్ పవర్ హాలీ డే ప్రకటించిన వైసిపి ప్రభుత్వం, విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై అదనపు భారం మోపడం అన్యాయమని టిడిపి ఇన్ ఛార్జ్ పివిజి కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టారిఫ్ కుదింపు, స్లాబుల మార్పు, ఫిక్స్ ఛార్జీలు, అదనపు డిపాజిట్ల రూపంలో 7 సార్లు ఛార్జీలు పెంచిన ఘనత వైసిపి ప్రభుత్వానిదే అని అన్నారు. ఈ కార్యక్రమంలో అద్దేపల్లి జగ్గారావు, ఉండూరు దేవుడు, కొసిరెడ్డి అప్పలనాయుడు, జోరెడ్డి రాము, సబ్బవరపు అప్పలనాయుడు, గొల్లవిల్లి శ్రీరామ్మూర్తి, పుప్పాల రమేష్, పేరపు కొండబాబు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

**నర్సీపట్నం టౌన్** :స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. జడ్పిటిసి సుకల రమణమ్మ మాట్లాడుతూ, వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత సామాన్యులపై విద్యుత్ భారం భారీగా మోపారని విమర్శించారు. పార్టీ ప్రెసిడెంట్ లాలం శ్రీరంగ స్వామి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు దనిమిరెడ్డి మధు, కొరపోలి శ్రీనివాస్, కొరుపోలు అప్పలరాజు పాల్గొన్నారు.

**కోటవురట్ల**: నేను విన్నాను నేను ఉన్నాను అని చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్ ప్రజలపై మోయలేని విద్యుత్ భారం మోపిందని మండల టిడిపి అధ్యక్షులు జానకి శ్రీను సోమవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షులు తిరుమలరావు, ఎస్ బాబ్జి, టి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

**గొలుగొండ** : మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు ఆధ్వర్యంలో జోగంపేట జంక్షన్ నుండి గొలుగొండ విద్యుత్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చోద్యం మాజీ సొసైటీ అధ్యక్షులు కొల్లాన కొండలరావు, చోద్యం సర్పంచ్ ఆదరెడ్డి గోపాలకృష్ణ, కె.ఎల్లవరం సర్పంచ్ కొల్లు రాంబాబు, జోగంపేట మాజీ సర్పంచ్ సుర్ల సీతారామమూర్తి, మాజీ జెడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్, కొత్తమల్లంపేట మాజీ సర్పంచ్ చిటికెల సాంబమూర్తి పాల్గొన్నారు.

# జగన్‌తోనే పథకాల కొనసాగింపు

**- ఎమ్మెల్యే బాబూరావు - పలు చోట్ల జగనన్న నువ్వే మా భవిష్యత్**

ఎమ్మెల్యేకు సమస్యను చెబుతున్న వృద్ధురాలు

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:పేదలకు ప్రభుత్వం అందిస్తున్న పలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు కొనసాగింపు జగనన్నతోనే సాధ్యమవుతుందని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్లబాబూరావు అన్నారు. సోమవారం మండలంలోని రామయ్యపట్నం గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు, నువ్వే మా నమ్మకం జగనన్న కార్యక్రమం నిర్వహించారు. ఆయన గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం నుండి అందుతున్న లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. పథకాలు అందని వారి వివరాలు అధికారులు పరిశీలించి సకాలంలో సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోలిశెట్టి పెదఈశ్వరరావు, కొణతాల శ్రీనువాసరావు, అద్దేపల్లి నూకునాయుడు, కొర్ని రాజా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**నర్సీపట్నం టౌన్:** జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నియోజకవర్గంలో విజయవంతంగా జరుగుతుందని ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, 234 మంది సచివాలయ కన్వీనర్లు, 4వేలకు పైగా గృహ సారథులు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ప్రతీ ఇంటి నుంచి విశేష స్పందన వస్తుందన్నారు. 14 రోజుల పాటు ఈ కార్యక్రమం దిగ్విజయంగా కొనసాగుతుందని తెలిపారు. నర్సీపట్నం రోడ్డు విస్తరణకు రూ.16 కోట్లు మంజూరు చేయడం జరిగిందని, త్వరలో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభ మవుతాయన్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య తీరుతుందన్నారు.

**గొలుగొండ:** మండలంలోని గుండుపాల సచివాలయ పరిధి జి.కొత్తూరు గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తులో జడ్పిటిసి సుర్ల వెంకటగిరి బాబు మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు ఎటువంటి మధ్యవర్తిత్వం లేకుండా అందేలా చేయడమే లక్ష్యమన్నారు. ఎంపిపి గజ్జలపు మణికుమారి, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, మండల సచివాలయాల కన్వీనర్ పాణి శాంతారాం, నాయకులు జోగు రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రచారం చేపడుతున్న నేతలు

## దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-రావికమతం:రావికమతం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని రావికమతం ఐసిడిఎస్ ప్రాజెక్టు అసిస్టెంట్ సిడిపిఓ పుష్ప దేవి తెలిపారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో రోలుగుంట మండలం గుర్రంపేట అంగన్వాడీ కేంద్ర కార్యకర్త, రావికమతం నాలుగు అంగన్వాడీ కేంద్ర సహాయకురాలు, బుచ్చయ్యపేట మండలం బుచ్చయ్యపేట ఒకటి అంగన్వాడి కేంద్ర సహాయకురాలు, రాజుపాలెం అంగన్వాడి కేంద్ర సహాయకురాలు, చోడవరం మండలం అంబేరుపురం సహాయకురాలి పోస్టులు ఖాళీ అయ్యాయన్నారు. ఈ పోస్టులకు సంబంధించి అర్హతలు, రిజర్వేషన్ ఇతర వివరాలకు ప్రాజెక్టు కార్యాలయంలో స్వయంగా వచ్చి తెలుసుకోవచ్చని ఆమె తెలిపారు. ఈ నెల 17లోపు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

## సహజ ఎరువులపై అవగాహన

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:సెంచురియన్ యూనివర్సిటీ కి చెందిన అగ్రికల్చరల్ బీఎస్సీ నాలుగవ సంవత్సరం విద్యార్థులు మండలంలో వేములపూడి రైతులకు సహజ సిద్ధమైన ఎరువులు వాడకంపై అవగాహన కల్పించారు. జీవామృతం, పంచగవ్య ఉపయోగాలని వివరించారు. సేంద్రియ ఎరువులు భూమిని ఏ విధంగా పొడుచేస్తాయో తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు హర్షిత, ఎం.సత్య శ్రీ పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

## 'విరామ బైబిల్' పోస్టర్ విడుదల

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:స్థానిక సిబిఎం కాంపౌండ్ వద్ద సెంటినరీ బాప్టిస్ట్ చర్చ్ వద్ద విరామ బైబిల్ పాఠశాల పోస్టర్‌ను విడుదల చేశారు. కరోనా కారణంగా గత రెండు సంవత్సరాలుగా నిర్వహించలేదని విబిఎస్ డైరెక్టర్ ఎన్.వయోల లిలియన్ తెలిపారు. మే 1, 2, 3, 4 తేదీలలో ప్రతిరోజు ఉదయం ఎనిమిది గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు విరామ బైబిల్ పాఠశాల తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. పిల్లలకు మధ్యాహ్నం ఉచిత భోజనం. స్నాక్స్ వంటివి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పిల్లలకు వ్యక్తిత్వ వికాసం తో పాటు చక్కని పాటలు, కథలు, యాక్షన్ సాంగ్స్ వంటి వాటిని నేర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చర్చి ఉపాధ్యక్షులు గిరిజల్, పాస్టర్ పి .జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## కోడి పందేల శిబిరంపై దాడి

ప్రజాశక్తి -రావికమతం: కొత్తకోట పోలీసు స్టేషన్ పరిధిలో కోడి పందేల శిబిరం పై దాడి చేసి 5గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.620తో పాటు 5కోళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు కొత్తకోట ఎస్ఐ విభీషణరావు తెలిపారు. స్టేషన్ పరిధిలో కొంజార్తి గిరిజన గ్రామంలో కోడిపందాలు ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో దాడి చేశామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నమోదు చేస్తున్న సిబ్బంది

## 'రైతు భరోసా' నమోదు

ప్రజాశక్తి-రావికమతం:గ్రామపంచాయతీలో భూమి కలిగిన ప్రతి రైతు రైతు భరోసా పథకాన్ని పొందాలని కవగుంట సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు తెలిపారు. మండలం కవగుంట గ్రామంలో సోమవారం సర్పంచ్ ఆధ్వర్యంలో రైతు భరోసా నమోదు సోమవారం చేపట్టారు. కొమిర సచివాలయ రైతు భరోసా ఇన్చార్జ్ శరత్ కుమార్ రైతులకు బయోమెట్రిక్ చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ, నాలుగు రోజులుగా రైతు భరోసా పథకం పొందలేని వారిని సర్వే ద్వారా గుర్తించడం జరిగిందన్నారు. సంక్షేమ పథకాలు అర్హత కలిగి ప్రతి ఒక్కరికి అందించడమే ధ్యేయంగా పని చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేష్, చేపూరి శేషు, వార్డు మెంబర్ ప్రగడ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# కల్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-మాడుగుల:మండల కేంద్రంలోని మోదమాంబ కాలనీలో రూ.30 లక్షలతో నిర్మించనున్న కళ్యాణ మండపానికి సోమవారం శంకుస్థాపన నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు ఆదేశాల మేరకు అనకాపల్లి ఎంపీ భీశెట్టి సత్యవతి నిధుల ద్వారా కళ్యాణ మండపం నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ పెదబాబు మాట్లాడుతూ, సుమారు కోటి రూపాయలతో గ్రామ శివారులోని కాలనీలలో రహదారులు, కాలువల నిర్మాణాలు జరుగుతున్నాయని, వీటితోపాటు పెద్ద సంఖ్యలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కళావతి, వైస్ సర్పంచ్ శ్రీనాధు శ్రీనివాసరావు, వార్డు సభ్యులు వరహాలు, మహేశ్వరి, జ్యోతి, వున్నేసా కాలనీ కి చెందిన పలువురు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేపడుతున్న నేతలు

## ఎంపిటిసిలు ప్రజల్లోకి వెళ్లాలి

ప్రజాశక్తి-రావికమతం:సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున ఎంపీటీసీలు ప్రజల్లోకి వెళ్లాలని చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పిలుపునిచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం అధికార పార్టీకి చెందిన ఎంపిటిసిలతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ, ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ మంజూరు అయ్యేందుకు ఎంపీటీసీలు కృషి చేయాలని కోరారు. దీనికోసం క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. గ్రామాలలో తాగునీరు, విద్యుత్తు, పారిశుద్యం, డ్రైనేజీలు, రోడ్లు తదితర సమస్యలు గుర్తించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు విడుదల కాగానే ప్రాధాన్యత ప్రకారం మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పైలరాజు, మండల పార్టీ అధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మీ నాయుడు, కంచిపాటి జగన్నాధరావు తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహార కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని సిహెచ్ నాగాపురం అంగన్వాడీ సెంటర్‌లో గర్భిణీలు, బాలింతలకు వైయస్సార్ పోషకాహార కిట్లను సోమవారం సర్పంచ్ యలమంచిలి రఘురామ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం తీసుకోవడంపై అంగన్వాడీ కార్యకర్తలు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త లక్ష్మి, ఆయా రమణమ్మ పాల్గొన్నారు.

## మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-మాడుగుల:మండల కేంద్రంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో సోమవారం మజ్జిగ పంపిణీ చేపట్టారు. జనసేన నాయకులు రాయపు రెడ్డి కృష్ణ ఆధ్వర్యంలో ఈ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాడుగుల నియోజకవర్గంలో జనసేనకు అనుకూలమైన వాతావరణం కనబడుతుందని తెలిపారు.

## ఘనంగా పరదేశమ్మ జాతర

ప్రజాశక్తి- కోటవురట్ల:మండలంలోని రామచంద్ర పాలెం గ్రామంలో పరదేశమ్మ జాతర మహోత్సవం ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం రాత్రి జాగారంతో ప్రారంభమై సోమవారం పెద్ద జాగారం అదే రోజు రాత్రి వేటాడే సింహాలు సాంఘిక నాటకం, తప్పెటగుళ్ళు పోటీలు నిర్వహించారు. మంగళవారం డాన్స్ బేబీ డాన్స్, రేలారే రేలా, కోలాటం, పూసల డాన్సులు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ పరదేశమ్మ కన్నబాబు తెలిపారు. గ్రామ పెద్దల సహకారంతో జరుగు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఊరేగిస్తున్న భక్తులు

టైల్ అందజేసిన దాతలు

## రామాలయానికి టైల్స్ వితరణ

ప్రజాశక్తి-గొలుగొండ: పాకలపాడు గ్రామానికి చెందిన మేడిశెట్టి వెంకట సూర్యనారాయణ, రమణమ్మ(వంటి) దంపతులు, కుటుంబ సభ్యులు పంచాయతీ శివారు గ్రామం దిబ్బలపాలెం రామాలయానికి రూ.95వేల విలువ గల టైల్స్ వితరణ చేశారు. ఈ సందర్భంగా దిబ్బలపాలెం గ్రామస్తులు కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు అభిమానులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు దుగనబోయిన సత్తిబాబు, నున్నగొప్పుల అప్పారావు, సియాద్రి అబ్బాయి, తాడి రాము మహిళలు పాల్గొన్నారు.

## నియామక పత్రాల అందజేత

ప్రజాశక్తి -ఎస్.రాయవరం:తహశీల్దార్ కార్యాలయంలో రీ సర్వే డి.టి నారాయణరావు చేతుల మీదుగా సోమవారం యూఎఫ్ ఆర్‌టిఐ నూతన కార్యవర్గంకు నియామక పత్రాలను అందజేశారు. అనకాపల్లి జిల్లా కన్వీనర్ బి.వి.వి సత్యనారాయణ ముఖ్య సలహా దారులు దండు గణపతి రాజు ఆధ్వర్యంలో ఈ పత్రాలు అందజేశారు. ఎస్.రాయవరం మండల కన్వీనర్ మైలపల్లి సత్తిరాజు, కో కన్వీనర్‌గా వాకపల్లి గోవిందమ్మ ,కో కన్వీనర్‌గా గొలుసు శివతో పాటు కమిటీ సభ్యులకు ఈ నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ మెంబర్ కోడ బంగార్రాజు, నక్కపల్లి మండల కన్వీనర్ పొలినాటి వీరబాబు, కోన బాబూరావు, సేనాపతి లోవరాజు, కోసూరు చిరంజీవి, తోట రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐని కలిసిన రాజు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని కృష్ణదేవిపేట నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన ఉపేంద్రను సోమవారం రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరెక్టర్ బొందల రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. బదిలీపై వెళుతున్న ఎస్సై సూర్యనారాయణను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ సుర్ల ఆదినారాయణ, సర్పంచుల ఫోరం అధ్యక్షులు ఎన్.శ్రీనివాస్, లింగంపేట సర్పంచ్ సంతోష్‌కుమార్, మాజీ స్కూల్ కమిటీ చైర్మన్ చేట్రోలు మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తనిఖీ చేస్తున్న డిప్యూటీ సిటీఎం

## ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో సౌకర్యాలపై ఆరా

ప్రజాశక్తి-గొలుగొండ: ఏఎల్‌పురం గ్రామంలో ఆర్టీసి కాంప్లెక్స్‌ను డిప్యూటీ సిటిఎం కె.వెంకట్రావు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్‌లో ఉన్న సౌకర్యాలపై ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. కాంప్లెక్స్‌లో తాగునీరు, రెండు ఫ్యాన్లు, ప్రయాణికులు కూర్చునేందుకు బల్లలను మూడు రోజుల్లో ఏర్పాటు చేస్తామన్నారు. కాంప్లెక్స్ ముందున్న ఖాళీ స్థలానికి సిసి వేయించడానికి కృషి చేస్తామన్నారు. కాంప్లెక్స్ ఆవరణలో కొత్తగా నిర్మిస్తున్న ఏడు షాపులకు టెండర్లకు పిలిచామని, వ్యాపార సముదాయాలకు కావల్సి వస్తే ఈ నెల 15వ తేదీ లోపు ఫోన్: 9392156562 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

నినాదాలు చేస్తున్న కూలీలు

## ఉపాధి హామీ కూలీల నిరసన

**ప్రజాశక్తి-ఎస్:రాయవరం:**సమస్యలను పరిష్కరించాలని మండలంలో పెట్టుగొల్లపల్లి గ్రామంలో సోమవారం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ కూలీలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం సత్యనారాయణ మాట్లాడుతూ, రోజు వారీ కూలి రూ.600 ఇచ్చి 200 రోజుల పని దినములు కల్పించాలని డిమాండ్ చేశారు. నీడ, మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు.

## మూడు బోర్లు ఏర్పాటు

**ప్రజాశక్తి-రోలుగుంట:** కొవ్వూరు గ్రామ పంచాయతీ పరిధి కొట్టే రవాణా పాకల వద్ద ప్రభుత్వం మంజూరు చేసిన మూడు బోర్లను వేరు వేరు చోట్ల ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. రైతుల కష్టాన్ని గుర్తించి ఈ పాకల దగ్గర బోర్లు వేయడంతో రైతులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాంతమ్మ, కన్వీనర్ వై.బాబురావు, ఉపసర్పంచ్ కనరెడ్డి అప్పలనాయుడు, చందక నూకరాజు, వైయస్సార్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు రోలుగుంట సర్వసభ్య సమావేశం

**ప్రజాశక్తి-రోలుగుంట:**ఈ నెల 11న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ప్రభాకరరావు తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

## బాధితునికి ఆర్థిక సాయం

**ప్రజాశక్తి -రావికమతం:** రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ జన సైనికుడుకు మండల పార్టీ రూ.45 వేల ఆర్థిక సాయం అందజేసింది. మండలంలో టీ.అర్జాపురం గ్రామానికి చెందిన గల్లా సాయికుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. కుటుంబానికి ఇతనే జీవనాధారం కావడంతో విషయం తెలుసుకున్న మండలంలో వివిధ గ్రామాలకు చెందిన జనసైనికులు రూ. 45వేలను సోమవారం చోడవరం నియోజవర్గ ఇన్చార్జ్ పి వి ఎస్ ఎన్ రాజు ఆధ్వర్యంలో భాదితుడు కు అందజేశారు.

## ఉత్తమ విద్య
## ఎస్ఎస్ఎసి కాలేజీ సొంతం

**ప్రజాశక్తి- కోటవురట్ల:**మండలంలోని పాములవాక గ్రామంలో ప్రైవేటు జూనియర్ కళాశాల ఎస్ఎస్ఎసి దినదిన అభివృద్ధి చెందుతుంది. నర్సీపట్నంలో సిరి కాలేజీతో ప్రారంభమై ఎంతో మంది విద్యార్థులకు విద్యను అందించాలని సంకల్పంతో సొంతంగా విద్యాసంస్థను ఏర్పాటు చేశారు. ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ అంచలంచెలుగా విద్యార్థులకు కార్పొరేట్ తరహాలో విద్యను అందిస్తుంది.ఉన్నత అధికారులుగానూ, వివిధ రంగాల్లో ఉద్యోగస్తులుగా విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్న ఏకైక విద్యా సంస్థ ఎస్ఎస్ఎసి. ఈ జూనియర్ కళాశాలలో ప్రస్తుత తరుణంలో బాలికలకు రక్షణ కల్పించడమే ధ్యేయంగా 2023-24 విద్యా సంవత్సరంలో వంద మంది విద్యార్థులకు ఉచిత హాస్టల్ వసతి కల్పించడానికి కళాశాల యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ఈనెల 30వ తేదీలోపు కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకొని సీట్లు పొందాలని కళాశాల కరస్పాండెంట్ సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.కళాశాలలో పాలిటెక్నిక్ ఎంట్రన్స్‌కు కోచింగ్ ఇస్తామన్నారు. ఈ సదా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

కరస్పాండెంట్ సాయి కుమార్

2013 భూసేకరణ చట్టం ప్రకారం

# రైతులకు ప్యాకేజీ ఇవ్వాలి

**ప్రజాశక్తి- నక్కపల్లి:**వైజాగ్ -చెన్నై ఇండస్ట్రీల్ కారిడార్ లో ఏర్పాటు చేస్తున్న పరిశ్రమల కొరకు రోడ్డు వేసేందుకు సేకరిస్తున్న భూములకు న్యాయపరమైన నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ రైతులతో కలిసి సోమవారం స్పందనలో అనకాపల్లిలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి కు వినతిపత్రం అందజేసినట్లు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు స్థానిక విలేకరులకు తెలిపారు. మండలంలోని న్యాయంపూడి, కాగిత, వేంపాడు రెవెన్యూ పరిధిలో న్యాయంపూడి, కాగిత, పాటిమీద గ్రామాల భూములు సేకరించి 150 అడుగుల వెడల్పుతో రోడ్డు వేయడానికి ఏపీఐఐసీ అధికారులు భూములు సేకరించడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. భూసేకరణ కారణంగా తరతరాల జీవనోపాధిని తామంతా శాశ్వతంగా కోల్పోతున్నామని, వాస్తవానికి భూములు ఇవ్వడానికి ఇష్టం లేదని, అయితే ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలని, ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో జీవనోపాధిని, మా బ్రతుకును త్యాగం చేసి భూములు ఇచ్చేందుకు సిద్ధపడినట్లు రైతులు జెసి దృష్టికి తీసుకువెళ్లారు. అధికారులు ఏ మాత్రం తమ త్యాగాలు గుర్తించకుండా, ప్రస్తుతం భూములకు ఉన్న విలువకు తగ్గట్టుగా నష్టపరిహారం చెల్లించకుండా తీవ్ర అన్యాయం చేస్తున్నారని జేసీ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు.
రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, అమలాపురం గ్రామ సర్పంచ్ శంకరరావు, రైతులు మాట్లాడుతూ, వైజాగ్-చెన్నై ఇండస్ట్రీల కొరకు నక్కపల్లి మండలంలో రాజయ్యపేట నుండి దోనివాని లక్ష్మీ పురం వరకూ 5 రెవెన్యూ గ్రామాలలో 5,500 ఎకరాలు సేకరించి ఒకే విధంగా నష్టపరిహారం చెల్లించారని, ఆ విధంగానే 3 రెవెన్యూ గ్రామాలలో రోడ్డు వేసేందుకు సేకరించిన భూములు కూడా ఒకే విధంగా పరిహారం చెల్లించాలని కోరారు. భూములు కోల్పోయిన ప్రతీ కుటుంబంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరికీ ఆర్ కార్డు లు ఇచ్చి , ఇక్కడ ఏర్పాటు చేసే పరిశ్రమల్లో శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. చెట్లు, నిర్మాణాలు కోల్పోతున్న వీరికి జీవో 268 ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని, 2013 భూసేకరణ ప్రకారం ప్యాకేజీలు ఇవ్వాలని కోరారు. భూ సేకరణకు నియమింపబడిన ప్రత్యేక ఉప కలెక్టర్ రైతులను బెదిరించే ధోరణిలో మాట్లాడుతున్నారని, పద్ధతి మార్చుకునే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. సమస్య పరిష్కరించే వరకు భూములు జోలికి అధికారులు రావద్దన్నారు. ఈ కార్యక్రమంలో రావి చిన్ని, రోకల శ్రీను, పెంటకోట నర్సింగరావు, నాగనబోయిన ఈశ్వరరావు పాల్గొన్నారు.

జెసితో మాట్లాడుతున్న అప్పలరాజు, రైతులు

## ఉద్యోగుల సమస్యలపై నిరసన

**ప్రజాశక్తి-అనకాపల్లి:**ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై ఏపీ జేఏసీ అమరావతి మలివిడత కార్యాచరణలో భాగంగా సోమవారం ఉద్యోగులు నల్ల మాస్కులు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తమ సమస్యల పరిష్కారం కోరుతూ జెసి కల్పనా కుమారి, అదనపు ఎస్పి విజయభాస్కర్‌కు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ సింగంపల్లి వాసు, కార్యదర్శి డి లోవరాజు, ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షులు పీవీ రత్నం, కార్యదర్శి ఎలమంచిలి శ్రీరామ్మూర్తి, సిటీ అధ్యక్షులు ఆర్వి నరసింహమూర్తి, కార్యదర్శి జి శ్రీను, క్లాస్ ఫోర్ సంఘం అధ్యక్షులు వెంకటరమణ, కార్యదర్శి శివకుమార్, ఇతర భాగస్వామ్య సంఘాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

# 'యజ్ఞంలా అన్న క్యాంటీన్ నిర్వహణ'

**ప్రజాశక్తి -యలమంచిలి:**ఎన్ని అడ్డంకులెదురైనా ఓ యజ్ఞంగా భావించి అన్న క్యాంటీన్‌ను నిర్వహిస్తున్నామని టిడిపి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు నానాజీ, రమణబాబు తెలిపారు. యలమంచిలిలో టిడిపి ఆధ్వర్యాన అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసి సోమవారంతో 70 రోజులు పూర్తయిన సందర్భంగా వారు ప్రజాశక్తితో మాట్లాడుతూ మనిషి ఆకలి విలువ తెలిసిన మహావ్యక్తి నందమూరి తారక రామారావు పేరిట నిర్వహిస్తున్న 'అన్న క్యాంటిన్' 70 రోజులుగా నిర్వహిస్తున్నామని చెప్పారు. తొలి రోజుల్లో క్యాంటీన్ నిర్వహణకు పోలీసులు ట్రాఫిక్ నిబంధనల పేరిట అభ్యంతరాలు చెప్పినప్పటికీ పార్టీ కార్యాలయం ముందు త్రినాథస్వామి చెరువు ముందు నిర్వహణకు అనుమతించారని చెప్పారు. పార్టీ అనుబంధ ఎన్ఆర్ఐ మహిళా విభాగం ఆధ్వర్యంలో మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావుల పర్యవేక్షణలో 5 రూపాయలకే రోజూ 300 మందికి భోజనం పెడుతున్నట్లు చెప్పారు. నిరుపేద అన్నార్తులతో పాటు భవన నిర్మాణ కార్మికులు, రోడ్డుపక్కన షాపుల్లో దిన కూలీ చేసుకొనే పేదలు ఈ అన్న క్యాంటీన్‌లో భోజనాలు చేస్తున్నారని తెలిపారు.

# సహకార రంగంలో దిట్ట రఘునాథరావు

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు వ్యవస్థాపక ఛైర్మన్ పి.రఘునాథరావు సహకార రంగంలో దిట్ట అని, అందరికీ ఆదర్శనీయులని పలువురు అతిథులు కొనియాడారు. దసపల్లా హోటల్‌లో జరిగిన రఘునాథరావు సన్మాన సభలో పలువురు ప్రముఖులు పాల్గొని మాట్లాడారు. తొలుత మిజోరాం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు మాట్లాడుతూ చిన్ననాటి నుంచి ఎన్నో వ్యయ ప్రయాసలను ఎదుర్కొంటూ, విద్యారంగంలో, జీవిత భాగస్వామ్యంలో, ఉద్యోగ రంగంలో విజయాలను సాధిస్తూ అందరి మన్ననలను పొందుతూ ముందుకు సాగిన పరుచూరు రఘునాథరావు నేటి యువతకు ఆదర్శప్రాయమన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన అడుగు జాడల్లో ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వ బ్యాంకుల్లో మెరుగైన ఉద్యోగాన్ని నిర్వర్తించడమే కాకుండా అదే రంగంలో పలువురికి ఉద్యోగాలను కల్పించి తన ఆశయ సాధనలో అరుదైన విజయాన్ని రఘునాథరావు సాధించారన్నారు. విశాఖ నగరం కేంద్రంగా ఏర్పాటు చేసిన కనకమహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంకును ఉమ్మడి ఏడు జిల్లాలో విస్తరించి, 200లకు పైగా ఉద్యోగాలను కల్పించడమే కాకుండా ఉద్యోగుల సంక్షేమానికి నిరంతరం కృషి చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ప్రముఖ ఆర్థికవేత్త కె.నరసింహమూర్తి మాట్లాడుతూ రఘునాథరావు తాను అభ్యసించిన విద్య, నిర్వర్తించిన ఉద్యోగం తనతోనే ముగిసిపోకుండా తనలాగా ఎంతో మందికి స్ఫూర్తిని కల్పించి అరుదైన గుర్తింపును సాధించారన్నారు. సభాధ్యక్షులు, బ్యాంకు ఛైర్మన్ కె.రాంబాబు మాట్లాడుతూ రఘునాథరావు తో ఆయనకున్న అనుభవాలు గుర్తు చేసుకున్నారు. జిల్లా సహకార శాఖాధికారి మిల్టన్ మాట్లాడుతూ ఖాతాదారులు, సిబ్బంది అభివృద్ధికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి రఘునాథరావు అన్నారు. విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు మాజీ అధ్యక్షులు మానం ఆంజనేయులు మాట్లాడుతూ సహకార బ్యాంకును నడపడం అంటే సహజమైన విషయం కాదని పేర్కొన్నారు. విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ రాఘవేంద్రరావు మాట్లాడుతూ రఘునాథరావుకు సన్మానం అంటే సహకార రంగానికి సన్మానమేనన్నారు. మహారాజా కో-ఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్, తదితరులు ఈ కార్యక్రమంలో మాట్లాడారు. అనంతరం మంగళవాయిద్యాల మధ్య అతిరథ మహారథులతో పరుచూరు రఘునాథరావు దంపతులకు సత్కారం జరిగింది. ఈ సందర్భంగా బ్యాంకు పాలకవర్గం రూపొందించిన ప్రశాంసా పత్రాన్ని అందజేశారు. కార్యక్రమం లో ఆదర్శ్ కోఆపరేటివ్ బ్యాంకు ఎమ్‌డి మధనగోపాలరావు, మాజీ మంత్రి సిహెచ్. అయ్యన్నపాత్రుడు, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, బ్యాంకు డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రఘునాథరావు దంపతులను సన్మానిస్తున్న అతిథులు

# ఎన్‌టిఆర్ విగ్రహ ఏర్పాటుపై వివాదం

**ప్రజాశక్తి- కోటవురట్ల:**మండలంలో పాములవాక గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు సిద్ధమైన తెలుగుదేశం నాయకులకు, వైసిపి నాయకులకు మధ్య సోమవారం వివాదం చెలరేగింది. అనంతరం సద్దుమణిగింది. వృథాగా ఉన్న పాత బస్ షెల్టర్ సమీపంలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు టిడిపి కార్యకర్తలు సిద్ధం కాగా వైసిపి నాయకులు అభ్యంతరం తెలపడంతో వివాదం మొదలైంది. టిడిపి నాయకులు వేచలపు జనార్ధన్, భాస్కరరావు విగ్రహ ఏర్పాటుకు పంచాయతీ అనుమతి కోరగా విషయం తెలుసుకున్న వైసిపి నాయకుడు కిల్లాడ శ్రీనివాసరావు పాత బస్టాండ్ సమీపంలో విగ్రహ ఏర్పాటుకు ససేమీర అనడంతోపాటు విషయం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు వెళ్ళగా స్థానిక ఎస్ఐ నారాయణరావుతో పాటు ఎంపీడీవో చంద్రశేఖర్, ఆర్ అండ్ బి ఇంజనీర్ రెడ్డి, స్థానిక రెవెన్యూ అధికారులు వివాద స్థలానికి చేరుకున్నారు. ఎన్టీఆర్ విగ్రహం పాత బస్టాండ్ స్థానంలో నిర్మించేందుకు అనుమతి ఇవ్వడానికి కుదరదని వైసీపీ నాయకుల వాదించారు.అధికారులు కలగజేసుకొని ఇరువర్గాల మధ్య వివాదం సద్దుమణిగే విధంగా చర్యలు తీసుకున్నారు. బస్సు షెల్టర్ నిర్మాణం పంచాయతీ నిధులతో మాత్రమే నిర్మించేందుకు వైసిపి నాయకులు అంగీకరించారు.ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు అధికారులు అనుమతి ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.